
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



కృష్ణా జిల్లా వార్తలు

సోమవారం 21 జూలై 2025

రేషన్ డాన్!

మచిలీపట్నం కేంద్రంగా జిల్లాలో రేషన్ దందా!

గిలకలదిండి ఫిషింగ్ హార్బర్ నుంచి కాకినాడ పోర్టుకు తరలింపు

ఆయన ఓ రేషన్ డాన్. మచిలీపట్నం కేంద్రంగా జిల్లావ్యాప్తంగా రేషన్ బియ్యం దందా నిర్వహిస్తున్నారు. అక్రమ బియ్యం రోడ్డు మార్గాన తరలిస్తుంటే పట్టుకుంటున్నారని సముద్ర మార్గాన్ని ఎంచుకున్నారు. ఇందుకు గిలకలదిండి ఫిషింగ్ హార్బర్‌ను అడ్డాగా మార్చుకున్నారు. ఒక్కో బోటులో 300 నుంచి 400 బస్తాలు లోడ్ చేసి గుట్టుగా కాకినాడ పోర్టుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈయనపై అనేక కేసులు ఉన్నాయి. పేర్ని నాని సతీమణి గోడౌన్‌లో బియ్యం మాయం ఘటనలోనూ నిందితుడిగా ఉన్నారు. అయినా కూడా దర్జాగా తన దందా కొనసాగిస్తున్నారు. అన్నీ తెలిసి కూడా అధికారులు ఈయనపై చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

- ఒక్కో బోటులో 300 నుంచి 400 బస్తాలు లోడింగ్
- రోడ్డు మార్గాన ఇబ్బందులు వస్తున్నాయని.. సముద్ర మార్గం ఎంపిక
- అన్నీ తెలిసినా చర్యలు తీసుకోని రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు!
- పేర్ని నాని సతీమణి గోడౌన్‌లో బియ్యం మాయం ఘటనలోనూ నిందితుడిగా డాన్
- రేషన్ డాన్‌పై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఫిర్యాదు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): మచిలీపట్నానికి చెందిన రేషన్ బియ్యం డాన్ రూటే సపరేటు. బియ్యం అక్రమ రవాణా రోడ్డు మార్గాన చేస్తుంటే అధికారులు పట్టుకుంటున్నారు. దీంతో రేషన్ డాన్ రూటు మార్చి సముద్ర మార్గాన్ని ఎంచుకున్నారు. గిలకలదిండి ఫిషింగ్ హార్బర్‌ను తన అక్రమ రవాణాకు కేంద్రంగా మార్చుకున్నారు. ఇక్కడి నుంచి మత్స్యకారులు బోట్ల మీద సముద్రంలోకి చేపల వేటకు బయలుదేరతారు. ఫిషింగ్ హార్బర్ నుంచి పెద్ద బోట్లను మాట్లాడుకుని అందులో బియ్యం బస్తాలను లోడింగ్ చేసి కాకినాడ పోర్టుకు తరలించేస్తున్నారు. ఒక్కో బోటులో 300 నుంచి 400 వరకు రేషన్ బియ్యం బస్తాలను లోడింగ్ చేస్తున్నారు. ఈ విషయం మచిలీపట్నం రెవెన్యూ అధికారులకు తెలిసినా కిమ్మనటం లేదని సమాచారం. బందరు రేషన్ డాన్ నుంచి వచ్చే ముడుపులకు ఆశపడి రేషన్ అక్రమ రవాణాను అడ్డుకోవటం లేదని ఆరోపణలు వస్తున్నాయి. మాజీ మంత్రి పేర్ని నాని సతీమణి గోడౌన్‌లో పేదల బియ్యం దొంగతనం కేసులో.. బందరు డాన్ కూడా నిందితుడిగా ఉన్నారు. గోడౌన్ నుంచి బియ్యాన్ని కాకినాడ పోర్టుకు తరలించిన వ్యవహారంలో ఈయన ప్రముఖ పాత్ర పోషించాడన్న అభియోగాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వంలోనూ బందరు డాన్ తన అక్రమ వ్యాపార విశ్వరూపాన్ని చూపిస్తున్నారు. బందరు రేషన్ డాన్‌పై మిగతా 6లో..

నాడు జిల్లా బహిష్కరణ

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో బందరు డాన్ రేషన్ అక్రమాలపై అప్పటి ఉమ్మడి కృష్ణా జిల్లా కలెక్టర్ బాలయ్య నాయుడు లక్ష్మీకాంతం జిల్లా బహిష్కరణ విధించారు. ఆయన కలెక్టర్‌గా ఉన్నంత కాలం రేషన్ డాన్ జిల్లాలో అడుగు పెట్టడానికి భయపడ్డారు. కలెక్టర్ బదిలీ తర్వాత మళ్లీ జిల్లాలోకి అడుగు పెట్టారు. ఇప్పటికీ జిల్లా అధికార యంత్రాంగంతో ఉన్న తన ఆర్థిక సంబంధాల రీత్యా ఇక్కడే తిష్టవేశారు.

జిల్లా వ్యాప్తంగా రేషన్ నెట్‌వర్క్

పేదల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరించటానికి జిల్లా వ్యాప్తంగా రేషన్ డాన్ తన నెట్‌వర్క్‌ను విస్తరించుకున్నారు. కార్డుదారుల దగ్గర నుంచి బియ్యాన్ని కొనుగోలు చేయటానికి తన మనుషులను ఎక్కడికక్కడ పెట్టుకున్నారు. ఎండీయూ వ్యవస్థ ఉన్నపుడు చాలా మంది ఆపరేటర్లను తన చేతుల్లో పెట్టుకున్నారు. ఇపుడు మళ్లీ డీలర్లను తన చేతుల్లోకి తీసుకున్నారు. వీరు కాకుండా మండలానికి ఒక రేషన్ లీడర్‌ను పెట్టుకుని వారి ద్వారా కూడా సమీకరిస్తున్నారు. ఇలా సమీకరించిన రేషన్ బియ్యాన్ని అంతటినీ తన రహస్య గోడౌన్‌లోకి తీసుకువెళ్లి 25 కేజీల బస్తాలుగా ప్యాకింగ్ చేయిస్తారు. ఇలా ప్యాకింగ్ చేయించిన వేలాది బస్తాలను బోట్ల ద్వారా సముద్ర మార్గాన కాకినాడ పోర్టుకు రవాణా చేస్తున్నారు.

త్రిశంకుస్వర్గం!

కృష్ణా వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల పరిస్థితి ఇదీ

- వర్సిటీ ఏర్పడిన నాటి నుంచి విధుల్లో కొనసాగుతున్న అధ్యాపకులు
- తాజాగా ఇంటర్వ్యూలకు రావాలని అధికారుల ఆదేశాలు
- వర్సిటీపై కోర్టుకెళ్లబోమని బాండ్ ఇవ్వాలని షరతు
- ఇంటర్వ్యూలకు హాజరుకాబోమని స్పష్టం చేసిన అధ్యాపకులు
- మద్దతు ప్రకటించిన రెగ్యులర్ ప్రొఫెసర్లు
- అధికారులు, అధ్యాపకుల మధ్య నడుస్తున్న వివాదం



కృష్ణా యూనివర్సిటీలో సరికొత్త వివాదం తెరపైకి వచ్చింది. వర్సిటీ ప్రారంభమైన (17 సంవత్సరాలు) నాటి నుంచి పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను తొలగించే కుట్రలో భాగంగా గత మూడు, నాలుగు రోజులుగా ఇంటర్వ్యూల పేరుతో వీరందరిని యూనివర్సిటీకి పిలిచారు. ఆయా సబ్జెక్టుల్లో నిష్ణాతులైన వారు కాంట్రాక్టు అధ్యాపకులను ఇంటర్వ్యూ చేసి, వారు ఇచ్చిన నివేదిక ప్రకారం తదుపరి చర్యలు ఉంటాయని చెప్పారు. దీంతో కాంట్రాక్టు అధ్యాపకుల్లో అలజడి మొదలైంది. ఇన్నేళ్లుగా తాము పనిచేస్తున్నామని, తమను ఇబ్బంది పెట్టేందుకే ఇలాంటి పన్నాగం పన్నారని, తాము ఇంటర్వ్యూలకు హాజరుకాబోమని స్పష్టం చేశారు. వీరికి యూనివర్సిటీలో పనిచేస్తున్న వివిధ కేడర్‌లలోని రెగ్యులర్ ప్రొఫెసర్‌లు సంఘీభావం ప్రకటించారు. దీంతో అవసరమైతే యూనివర్సిటీ అధికారుల నిర్ణయంపై హైకోర్టును ఆశ్రయించి అక్కడే తేల్చుకుంటామని కాంట్రాక్టు అధ్యాపకులు అంటున్నారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కృష్ణా యూనివర్సిటీలో 75 మంది ఫ్యాకల్టీ ఉన్నారు. వీరిలో 53 మంది కాంట్రాక్టు అధ్యాపకులు కాగా, మిగిలిన 22 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు, అసోసియేట్ ప్రొఫెసర్‌లు, ప్రొఫెసర్‌లు ఉన్నారు. వీరంతా వివిధ సబ్జెక్టులను బోధిస్తున్నారు. 2008లో యూనివర్సిటీ ప్రారంభమైన నాటి నుంచి కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న అధ్యాపకులే అధికశాతం మంది ఉన్నారు. వివిధ సబ్జెక్టులలో పాఠ్యాంశాల బోధన నిమిత్తం 2012, 2015, 2020లో మిగతా 6లో..

కుటుంబసభ్యులకు కిషోర్‌ను అప్పగించిన ఎస్సై సత్యనారాయణ



అదృశ్యమైన ఏఈఈ కిషోర్ కథ సుఖాంతం

రాజమండ్రిలో అదుపులోకి తీసుకున్న పోలీసులు

- విచారణ అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగింత
- కుటుంబ సభ్యులు గుర్తుకొచ్చి ఆత్మహత్య విరమించుకున్నట్టు వెల్లడి

తిరువూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల క్రితం అదృశ్యమైన స్థానిక జలవనరులశాఖ ఏఈఈ వి.కిషోర్‌ను ఆదివారం పోలీసులు సురక్షితంగా తీసుకువచ్చి కుటుంబసభ్యులకు అప్పగించడంతో కథ సుఖాంతం అయ్యింది. ఎస్ఐ కె.వి.జి.వి.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక జలవనరుల శాఖలో ఏఈఈగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న వి.కిషోర్‌ను సాధారణ బదిలీల్లో భాగంగా గౌరవరం ఎన్ఎస్పీ ఓఅండ్ఎం విభాగానికి గత నెల 16న బదిలీ చేశారు. అయినా పీడబ్ల్యూడీ అధికారులు రిలీవ్ చేయకపోవడంతో వారి చర్యలతో విసిగిపోయానని, ఇక ఆత్మహత్య చేసుకుంటున్నానని, దీనికి పలువురు కారణమని పేర్కొంటూ లేఖ రాసి కిషోర్ అదృశ్యమయ్యాడు. దీనిపై ఏఈఈ మామ ఆనందరావు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాంకేతికత ఆధారంగా రెండు బృందాలు విచారణ చేపట్టారు. సెల్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా రాజమండ్రిలో ఉన్నట్లు గుర్తించి ఏఈఈని పట్టుకుని తిరువూరు తీసుకువచ్చారు. విచారణ అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఉద్యోగ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తున్నా అధికారులు వేధించడంతో ఆత్మహత్యకు ప్రయత్నించానని, కుటుంబ సభ్యులు గుర్తుకురావడంతో విరమించుకున్నట్లు ఏఈఈ పోలీస్ విచారణలో వెల్లడించారు.

జిల్లాలో భారీ వర్షం

అత్యధికంగా పెనమలూరులో 87.6 మిల్లీ మీటర్ల వర్షం

జిల్లా సగటు వర్షపాతం 12.5 మిల్లీమీటర్లుగా నమోదు



ప్రకాశం బ్యారేజీకి వరద

కృష్ణానది ఎగువన ఉన్న పరివాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాల కారణంగా ప్రకాశం బ్యారేజీకి వరద నీరు వచ్చి చేరుతోందని, సోమవారం ఉదయం ఆరు గంటలకు ప్రకాశం బ్యారేజీ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తామని జలవనరులశాఖ అధికారులు ఆదివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. వరదనీటి ఉధృతిని బట్టి బ్యారేజీ నుంచి దిగువకు నీటి విడుదల పెంచుతామని పేర్కొన్నారు. నదీ తీరం వెంబడి లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

మచిలీపట్నం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం 8.30 గంటల వరకు పెనమలూరులో అత్యధికంగా 87.6 మిల్లీ మీటర్లు, పమిడిముక్కలలో అత్యల్పంగా 1.2 మిల్లీమీటర్లు పడింది. జిల్లా సగటు వర్షపాతం 12.5 మిల్లీమీటర్లుగా నమోదైంది. బంటుమిల్లిలో 46.2, గుడ్లవల్లేరులో 31.2, నాగాయలంకలో 26.8, కంకిపాడులో 12.8, పెడనలో 12.8, మచిలీపట్నం నార్త్, సౌత్ మండలాల్లో 11.2, గన్నవరంలో 10.4 మిల్లీమీటర్ల వర్షం పడింది. మిగిలిన మండలాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. వర్షం రాకతో జిల్లాలో వరినాట్లు వేగవంతమవుతాయని రైతులు చెబుతున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 60 వేల హెక్టార్లలో వరినాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 24వ తేదీన ఏర్పడే అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఈ నెల 26వ తేదీ వరకు కోస్తాతీరం వెంబడి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది.

ఎట్టకేలకు వెలుపలకు ఎక్స్‌కవేటర్‌లు

తోట్లవల్లూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రొయ్యూరులో నిర్వహిస్తున్న అక్రమ ఇసుక, బుసక క్వారీల నుంచి శనివారం సాయంత్రం రెండు ఎక్స్‌కవేటర్‌లు బయటకు వెళ్లాయి. అనుమతి లేని క్వారీల్లో తవ్వకాలను నిలిపి వేసినట్టు తహసీల్దార్ ఎం.కుసుమకుమారి ఆదివారం తెలిపారు. ఇక్కడ క్వారీ నిర్వహణకు ఎవ్వరికి అనుమతులు లేవని స్పష్టం చేశారు.



రొయ్యూరు క్వారీల నుంచి వల్లూరుపాలెం పాత ర్యాంపు వైపుగా బయటకు వస్తున్న ఎక్స్‌కవేటర్‌లు



కారకంపాడులో నీటమునిగిన పొలాలు చూపుతున్న రైతులు

నిన్నటి వరకు నీరు లేక బీటలు వారిని వరి నాట్లు వేసిన పొలాలు శనివారం రాత్రి విస్తారంగా కురిసిన వర్షానికి చెరువులను తలపిస్తున్నాయి. అయ్యంకి, కారకంపాడు రోడ్డులోని పొలాలు ముంపునకు గురయ్యాయి. ఆవిరిపూడి, చినముత్తేవి, నిడుమోలు గ్రామాల్లోనూ ఇటీవల నాట్లు వేసిన పొలాలు నీట మునగటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. -ఆంధ్రజ్యోతి-కూచిపూడి

వైభవంగా సుబ్బారాయుడి ఆడికృత్తిక మహోత్సవం 6

నిధుల గోల్‌మాల్‌పై గుడ్లవల్లేరు ఈవోకు నోటీసు 6

ఇంద్రకీలాద్రిపై పోటెత్తిన భక్తులు



కోర్టు ఆవరణలో పోలీస్ బందోబస్తు

కట్టుదిట్టం!

ఏసీబీ కోర్టుకు రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి

- కోర్టు చుట్టూ అన్ని మార్గాలను మూసివేసిన పోలీసులు
- న్యాయదేవతకు ఐదంచెల భద్రత
- నిర్మానుష్యంగా కోర్టు పరిసరాలు
- పోలీసుల తీరుపై న్యాయవాదుల అసంతృప్తి

విజయవాడ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గోపాల్‌రెడ్డి రోడ్డు నిర్మానుష్యంగా మారింది. ఆ మార్గంలో రాకపోకలు కొన్ని గంటలపాటు ఆగిపోయాయి. దానికనుసంధానంగా ఉన్న మార్గంలోనూ అదే పరిస్థితి. విజయవాడ న్యాయస్థానాల ప్రాంగణం వద్ద ఆదివారం కనిపించిన దృశ్యాలివి. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డిని ఏసీబీ కోర్టులో ఆదివారం హాజరుపరిచారు. ఇంతకు ముందు జరిగిన పరిణామాల నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. న్యాయస్థానాల సముదాయంలో ఉన్న ప్రాంతాలను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. కేసుకు సంబంధించిన న్యాయవాదులు, న్యాయస్థాన సిబ్బంది మాత్రమే న్యాయస్థానాల ప్రాంగణంలోకి వెళ్లేలా ఐదంచెల భద్రతను ఏర్పాటు చేశారు. రాజ్‌భవన్ మిగతా 6లో..

నింగి నుంచి నిఘా

మిథున్ రెడ్డిని ఆసుపత్రి నుంచి కోర్టుకు తీసుకురావడం మొదలు రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించే వరకు పోలీసులు నింగి నుంచి డ్రోన్లతో నిఘా పెట్టారు. న్యాయస్థానాల ప్రాంగణంతో పాటు దాని చుట్టుపక్కల ఉన్న గల్లీల్లో ఎవరెవరు ఉన్నారు, అక్కడ ఏం జరుగుతోంది అన్న విషయాలను ప్రత్యక్షంగా కమాండ్ కంట్రోల్ నుంచి పరిశీలించారు.



కోర్టు వద్ద న్యాయవాదులు, పోలీసుల వాగ్వాదం



కోర్టు వద్దకు వెళ్లకుండా ఏర్పాటు చేసిన బారికేడ్లు,



నిర్మానుష్యంగా కోర్టు రోడ్డు

వైభవంగా సుబ్బారాయుడి ఆడికృత్తిక మహోత్సవం

● శాకంబరి అలంకరణలో వల్లీ,దేవసేన సమేత సుబ్రహ్మణేశ్వరస్వామి

మోపిదేవి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మోపిదేవిలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి జన్మనక్షత్రమైన ఆషాఢ ఆడి కృత్తిక మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం శ్రీవల్లీ, దేవసేన అమ్మవార్లకు వివిధ రకాల పండ్లు, కూరగాయలతో శాకంబరిగా అలంకరించి, ఆలయ ప్రాంగణాన్ని కూరగాయలతో సుందరంగా తీర్చిదిద్దారు. స్వామికి విఘ్నేశ్వర పూజ, 108 కలశాలతో అష్టోత్తర కలశాభిషేకం, చతుర్వేద పండితులు, 11 మంది రుత్వికులచే మహాన్యాసపారాయణ పంచామృత అభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలతో వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఏకాదశ రుద్రాభిషేకాలు శాస్త్రోక్తంగా జరిపారు. ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు స్వామికి శాస్త్రోక్తంగా పూజలను ప్రారంభించగా, అర్చక బృందం వేదమంత్రాలతో నిర్వహించారు. ఆదివారం స్వామి జన్మనక్షత్రమైన ఆడికృత్తికను పురస్కరించుకుని పలు ప్రాంతాల నుంచి భక్తులు భారీగా రావటంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఉద్యోగులు పర్యవేక్షించారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పూజలు



శాకంబరి అలంకరణలో వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, ఆడికృత్తిక మహోత్సవంలో భాగంగా స్వామికి నిత్య శాంతి కల్యాణం

స్వామికి విశేష పూజలనంతరం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం స్వామికి లక్షబిళ్వార్చన, వివిధ రకాల పుష్పాలతో పుష్పార్చనను రుత్వికుల బృందం జరిపారు. వేదపండితులచే స్వామికి నిత్య శాంతి కల్యాణము, మహానివేదన, పంచ హారతులు, చతుర్వేద స్వస్తిని వేదమంత్రోచ్చరణల నడుమ జరిపారు. అనంతరం స్వామికి విశేష అలంకరణ అనంతరం భక్తులకు దర్శనం ఇచ్చారు. పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు స్వామిని దర్శించుకోగా, ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో సహాయక ఉద్యోగులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఆర్టీసీ ప్రైవేటీకరణకు ప్రభుత్వం కుట్ర

సీపీఎం రాష్ట్ర నేత సీహెచ్ బాబూరావు

బస్టేషన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రైవేటీకరణకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తుందని సీపీఎం రాష్ట్ర నేత సీహెచ్ బాబూరావు, దోనేపూడి కాశీనాథ్ అన్నారు. విజయవాడ ఆర్టీసీ పాత బస్టాండ్ స్థలాన్ని లులు సంస్థకు కట్టబెట్టడాన్ని నిరసిస్తూ ఆదివారం గవర్నరుపేట -2 డిపో వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. రాష్ట్ర నేతలు సీహెచ్ బాబూరావు, దోనేపూడి కాశీనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రులను దెబ్బతీసి విదేశీ సంస్థలకు భూములు, ప్రజల ఆస్తులు పందారం చేయటం నమ్మకద్రోహమన్నారు. రూ.400 కోట్ల విలువైన ఐదెకరాల పాతబస్టాండ్ ఆర్టీసీ స్థలాన్ని లులు మాల్‌కు కట్టబెట్టటాన్ని వ్యతిరేకిస్తున్నట్టు చెప్పారు. విశాఖపట్టణంలో 13 ఎకరాలు, విజయవాడలో 5 ఎకరాలు లులు సంస్థకు ధారాధత్తం చేయటం అన్యాయమన్నారు. బృందావన్ కాలనీలోని సుమారు రూ.25 కోట్ల విలువైన మునిసిపల్ స్థలాన్ని రాఘవేంద్ర మఠానికిస్తూ విజయవాడను క్రమంగా అమ్మకానికి పెడుతున్నారన్నారు.ప్రజల ఆస్తుల పరిరక్షణకు ప్రజలే ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. ఆర్టీసీ సంస్థ పరిరక్షణకు కార్మికులు, ఉద్యోగులు నడుం బిగించి ఆర్టీసీ స్థలాలను కాపాడుకోవాలని సూచించారు. సీపీఎం నేతలు బోయ సత్యబాబు, బీ రమణారావు, పబ్బూ కృష్ణ, కే దుర్గారావు, ఈవీ నారాయణ పాల్గొన్నారు. కాగా, ఈ ఆందోళనకు ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘాల నేతలు మద్దతు తెలిపారు.



సీపీఎం ఆధ్వర్యంలో గవర్నరుపేట-2 డిపో వద్ద ధర్నా చేస్తున్న నేతలు

ఆర్టీసీ ఆస్తుల ధారాదత్తం దుర్మార్గం

సీపీఐ నగర కార్యదర్శి కోటేశ్వరరావు

బస్టేషన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఆర్టీసీ ఆస్తులను కార్పొరేట్‌లకు ధారాదత్తం చేయటం దుర్మార్గమని సీపీఐ నగర కార్యదర్శి జీ కోటేశ్వరరావు అన్నారు. రూ.400 కోట్ల విలువైన విజయవాడ ఆర్టీసీ గవర్నరుపేట డిపో స్థలాన్ని ప్రభుత్వం లులు కంపెనీకి అప్పగించటాన్ని నిరసిస్తూ ఆదివారం ఆ డిపో ప్రాంగణంలో నగర సీపీఐ కమిటీ ఆధ్వర్యంలో నిరసన ధర్నా జరిగింది. ఈ సందర్భంగా జీ కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆర్టీసీలో అద్దె బస్సుల పేరుతో దశలవారీగా ఆర్టీసీని, వందల కోట్ల విలువైన ఆర్టీసీ ఆస్తులను ప్రైవేట్ పరం చేసే కుటిల ప్రతిపాదనలను తక్షణమే ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే ఆర్టీసికి ఆర్థిక సహాయం అందించి నేరుగా ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేయాలని, ఉద్యోగ నియామకాలు జరిపి సంస్థను బలోపేతం చేయాలని కోరారు. లేదంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఎల్ దుర్గారావు, నక్కా వీరభద్రరావు, కేవీ భాస్కరరావు, తాడి పైడయ్య, పంచదార్ల దుర్గాంబ, డీవీ రమణబాబు, కే రమణరావు, ఓర్సు భారతి, ఎస్‌కే నజీర్, లంకా గోవిందరాజులు, కంచర్ల భార్గవ్, సాయికుమార్ పాల్గొన్నారు.



గవర్నరుపేట-2 డిపో వద్ద సీపీఐ నగర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు

ఇంద్రకీలాద్రి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. ఆషాఢ మాస సారె సమర్పణలు ముమ్మరంగా సాగుతున్నాయి. తమ ఇలవేల్పునకు పొంగళ్లు సమర్పించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తండోపతండాలుగా వచ్చారు. తెల్లవారుజాము నుంచే రద్దీ పెరగడంతో ఈవో శీనానాయక్ స్వయంగా పర్యవేక్షించి సిబ్బందికి సూచనలు ఏయడంతో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించారు. ఆషాఢమాసం చివరి ఆదివారం కావటంతో భక్తులు సారె సమర్పణకు, సాధారణ దర్శనానికి, ఆర్జిత సేవలకు భక్తులు సమూహాలుగా వచ్చారు. ఆలయ పరిసర ప్రాంతాలన్నీ ఆధ్యాత్మిక వాతావరణంలో శోభిల్లాయి. రద్దీ కారణంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అన్ని దర్శనం క్యూలైన్లలో భక్తులను టిక్కెట్ లేకుండా అనుమతించినట్టు ఈవో శీనానాయక్ తెలిపారు. టికెట్ అమ్మకాల ఆదాయం కన్నా భక్తుల సౌకర్యం, భద్రత ప్రధానంగా భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఈవో పేర్కొన్నారు. అంతరాలయ దర్శనం, వీఐపీ దర్శనం రద్దు చేసి సామాన్య భక్తులకే ప్రథమ ప్రాధాన్యత ఇచ్చామని, వికలాంగులు, వృద్ధులు, చంటిబిడ్డల తల్లులు, నడవలేని స్థితిలో ఉన్నవారికి మాత్రమే లిఫ్ట్ ప్రవేశం కల్పించామన్నారు. ఆ మార్గంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లను, మహామండపం ప్రతి అంతస్తుకి అధికారులను నియమించడంతో మధ్యాహ్నం 3 గంటల వరకు 62,426 మందికి దర్శనం సజావుగా జరిగిందని ప్రకటించారు.



అమ్మవారికి ఆషాఢ సారె తీసుకువచ్చిన భక్త బృందాలు

నిత్యాన్నదానానికి విరాళాలు

దుర్గమ్మ సన్నిధిలో ఉచిత అన్నదాన పథకానికి ఆదివారం విజయవాడ భవానీపురానికి చెందిన కేసరి శ్రీనివాసరెడ్డి, విజయలక్ష్మి దంపతులు కుమార్తె నివిద, తల్లిదండ్రులు సుబ్బారెడ్డి, రాజేశ్వరి పేరున రూ.1,01,116, గుంటూరు చంద్రమౌళినగర్‌కు చెందిన శివశంకర్, పద్మ దంపతులు మోహనసాయి, లక్ష్మీనారాయణ, డాక్టర్ రజని పేరున రూ.లక్ష, గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన జీ రంగలక్ష్మి, సూర్యనారాయణ ప్రసాద్ దంపతులు వారి తల్లి జీ జయలక్ష్మి పేరున గో సంరక్షణ నిధికి రూ.1,01,116 విరాళాలు అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు దాతలకు అమ్మవారి దర్శనం కల్పించగా దర్శనానంతరం వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. అధికారులు లడ్డూ ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.

అమ్మ ఆసరాతో బంగారు భవితకు బాసట

● ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

మొగల్రాజపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పేద కుటుంబాల పిల్లలకు చదువుకు ఆర్థిక ఇబ్బందులు ఆడ్డంకి కాకూడదని ఆంధ్రామోటార్ మర్చంట్స్ (అమ్మ) అసోసియేషన్ అందిస్తున్న ఉపకారవేతనాలను అందుకున్నవారు బంగారు భవితకు బాటలు వేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ లక్ష్మీశ చెప్పారు. మొగల్రాజపురం సున్నపు బట్టీల సెంటర్‌లోని అమ్మ హాలులో ఆదివారం ఉపాకార వేతనాల పంపిణీ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ 3 దశాబ్దాలుగా చిన్నారులకు అమ్మ సహాయం అందించడం, ఈ ఏడాది 408 మందికి రూ.16.60 లక్షల విలువైన ఉపకార వేతనాలు, నోటు పుస్తకాలివ్వడం అభినందనీయమన్నారు. సీఎం చంద్రబాబు పీ4 పథకాన్ని స్ఫూర్తిగా తీసుకుని అమ్మ వారు 300 బంగారు కుటుంబాలకు మార్గదర్శకులుగా వ్యవహరించి ఆ కుటుంబాలను పైకి తెచ్చేందుకు ముందుకు రావడం సంతోషమన్నారు. అమ్మ అధ్యక్షుడు గారపాటి సతీష్, అమ్మ ఉపాధ్యక్షుడు గోనుగుంట్ల వెంకట సుబ్బారావు, దోనేపూడి దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శి సుంకర చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శి కే దుర్గామల్లేశ్వరరావు, కార్యవర్గ సభ్యులతో పాటు మాజీ అధ్యక్షుడు మిరియాల వెంకటేశ్వరరావు, జిల్లా రెడ్ క్రాస్‌సొసైటీ వైస్ చైర్మన్ డాక్టర్ వెలగా జోషి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఉపకార వేతనాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్, చిత్రంలో అమ్మ కార్యవర్గ సభ్యులు



అమరావతి పనులపై సమీక్ష చేస్తున్న మంత్రి నారాయణ

వర్షాకాలంలో అమరావతి నిర్మాణ పనులు నిలిచిపోకుండా చర్యలు తీసుకోండి

● అధికారులకు మంత్రి నారాయణ ఆదేశాలు

విజయవాడ సిటీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతిలో భవనాల నిర్మాణ పనులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని సీఆర్డీఏ, ఏడీసీ అధికారులను పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ ఆదేశించారు. విజయవాడలోని సీఆర్డీఏ కార్యాలయంలో అమరావతి పనుల పురోగతిపై ఆదివారం సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వర్షాకాలంలోనూ పనులు నిలిచిపోకూడదని సూచించారు. కార్మికులకు అవసరమైన వస్తు సామగ్రిని సంపూర్ణంగా సమకూర్చాలన్నారు. రోడ్లు, భవన నిర్మాణ పనులు నిర్ణీత కాల వ్యవధిలో పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణ పనుల పురోగతి నివేదికలను ఎప్పటికపుడు ప్రభుత్వానికి అందజేయాలని సూచించారు. అమరావతిలో జరుగుతున్న పనులను ఈ నెల 21న సోమవారం తాను స్వయంగా పరిశీలిస్తానని ఈ సందర్భంగా మంత్రి వెల్లడించారు. ఈ సమీక్షలో చీఫ్ ఇంజనీర్ గోపాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కట్టుదిట్టం!

(5వ పేజీ తరువాయి)

వద్ద ఉన్న నాగేంద్ర స్వామి ఆలయం వద్ద కోర్టువైపు వెళ్లే మార్గాన్ని బారికేడ్లతో మూసివేశారు. ఆ తర్వాత సాయిరాం హోటల్ వద్ద నుంచి కోర్టుకు వెళ్లే గోపాల్‌రెడ్డి రోడ్డులో అడ్డంగా బారికేడ్లు పెట్టారు. ఇక్కడ రోప్ పార్టీలను బందోబస్తు నిమిత్తం నియమించారు. ఇది దాటిన తర్వాత కోర్టు ప్రధాన ద్వారం వద్ద మరికొంత మందితో బందోబస్తు ఏర్పాటుచేశారు. కోర్టు భవనానికున్న లిఫ్ట్ మార్గాల వద్ద మరికొంతమందిని నియమించారు. కోర్టుహాలు చుట్టూ టాస్క్‌ఫోర్స్, లా అండ్ ఆర్డర్ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. మిథున్ రెడ్డి కుటుంబ సభ్యులను, వైసీపీ ప్రజాప్రతినిధులను, న్యాయవాదులను మాత్రమే పోలీసులు ఈ ఐదంచెల భద్రత దాటి అనుమతించారు. కొంతమంది న్యాయవాదులు నల్లకోటు లేకుండా రావడంతో పోలీసులు ఈ బారికేడ్ల వద్ద అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, న్యాయవాదులకు మధ్య రిమాండ్ తీర్పు వచ్చేవరకు వాగ్వాదాలు జరుగుతూనే ఉన్నాయి. కొంతమంది న్యాయవాదులు ద్వారాల వద్ద కోర్టు తమ ఇలాకా అంటూ వీరంగం చేశారు. ఈసారి పోలీసులు మీడియాకు సైతం బారికేడింగ్ చేశారు. బార్ అసోసియేషన్ వద్ద మీడియాను ఆపేసారు. కోర్టుహాలు వద్దకు మీడియాకు అనుమతి లేదని అడ్డుకున్నారు. మిథున్‌రెడ్డిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించేవరకు మీడియా ప్రతినిధులు ఉన్న ప్రదేశానికి చుట్టూ బారికేడ్లను ఏర్పాటు చేసి రోప్ పార్టీలను ఉంచారు.

రేషన్ డాన్!

(5వ పేజీ తరువాయి)

ఉన్న కేసులు చూస్తే బాప్‌రే అనాల్సిందే. ఇప్పటి వరకు 62 కేసులు అతని మీద ఉన్నా సరే .. ఏ వ్యవస్థకూ వెరవకుండా అక్రమ రేషన్ వ్యాపారాన్ని మరింత ముందుకు తీసుకువెళుతున్నారు. పోలీస్ స్టేషన్‌లో ఈ రేషన్ డాన్‌పై సస్పెక్ట్ షీట్ కూడా ఉంది.

అధికారులకే బెదిరింపులు

తన నుంచి లబ్ధిపొంది వదిలేస్తే సరి, లేక ఎవరైనా చట్టం తన పని తాను చేసుకు పోతుందని చెప్పే వారిపై అదే చట్టాన్ని ప్రయోగించటం బందరు రేషన్ బియ్యం డాన్ ప్రత్యేకత. చేసేది రేషన్ అక్రమ వ్యాపారమే అయినా జీఎస్టీ బిల్లులతో సక్రమ వ్యాపారం చేస్తున్నట్టుగా వ్యవస్థలను బెదిరించే స్థాయికి ఎదిగారు. పేదల బియ్యాన్ని పట్టుకున్న సివిల్ సప్లయిస్ అధికారులు ఆ బియ్యాన్ని వేలం వేస్తారు. తిరిగి ఆ బియ్యాన్ని డాన్ కొనుగోలు చేస్తారు. దీనికి సివిల్ సప్లయిస్ అధికారులు ఇచ్చే బిల్లులను అనేక కాపీలుగా తీసి వాటిని అడ్డం పెట్టుకుని వ్యవస్థలను మభ్యపెట్టి అక్రమ బియ్యం వ్యాపారం చేస్తుంటారు. ఎవరైనా రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు కేసులు పెడితే తన దగ్గర జీఎస్టీ బిల్లులు ఉన్నాయంటూ తిరిగి వారిపైన కేసులు వేస్తున్నారు.

దుకాణం లేకపోయినా రేషన్ డీలర్ల సమావేశాలకు..

బందరు బియ్యం డాన్‌కు ఎలాంటి చౌక దుకాణం లేకపోయినా.. తహసీల్దార్ రేషన్ డీలర్లకు నిర్వహించే సమావేశాలకు హాజరవుతారు. అది కూడా తహసీల్దార్‌కు ముందు వరుసలో కూర్చుంటారు. పేదల రేషన్ బియ్యంతో అక్రమ వ్యాపారం చేస్తున్న రేషన్ డాన్‌ను తన ముందు కూర్చోపెట్టుకుంటున్నారంటే తహసీల్దార్ వ్యవహార శైలిపైనా ఆరోపణలు వస్తున్నాయి. బందరు తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్లకు రేషన్ డాన్ అక్రమాల గురించి అన్నీ తెలిసినా పట్టించుకోవటం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఈ రేషన్ డాన్ వ్యవహారంపై ఓ వ్యక్తి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఫిర్యాదు చేశారు.

త్రిశంకుస్వర్గం!

(5వ పేజీ తరువాయి)

కాంట్రాక్టు పద్ధతిపై అధ్యాపకులను తీసుకున్నారు. 2012లో కాంట్రాక్టు అధ్యాపకులకు ఇంటర్వ్యూలు నిర్వహించి వారి పనితీరు బాగుండకపోతే తొలగించాలని అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో కాంట్రాక్టు అధ్యాపకులంతా హైకోర్టును ఆశ్రయించారు. కాంట్రాక్టు అధ్యాపకులను తొలగించవద్దని హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందని, దీంతో ఇంతకాలంగా తాము కాంట్రాక్టు పద్ధతిపై కొనసాగుతున్నామని వారు చెబుతున్నారు.

ఏడాదిలో కొన్ని రోజులు నిలిపి.. మళ్లీ పోస్టింగ్

కాంట్రాక్టు అధ్యాపకులంతా తమ ఉద్యోగ భద్రత కోసం 2012లో హైకోర్టును ఆశ్రయించిన సమయంలో కాంట్రాక్టు అధ్యాపకుల అర్హతలను బట్టి మినిమం టైమ్ స్కేల్(ఎంటీఎస్) పద్ధతిన అమలు చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందని కాంట్రాక్టు అధ్యాపకులు చెబుతున్నారు. అన్ని యూనివర్సిటీలలో మాదిరిగానే కృష్ణా యూనివర్సిటీలో కాంట్రాక్టు అధ్యాపకులకు సీనియార్టీని పరిగణనలోకి తీసుకుని జీతంతో పాటు ప్రతి ఏడాది ఇంక్రిమెంట్లు కూడా ఇస్తున్నారని తెలియజేస్తున్నారు. గతంలో ఏడాదిలో ఒక రోజు, లేదా వారం, 15 రోజులపాటు తాము ఉద్యోగం చేయనట్లుగా చూపి, ఎలాంటి ఇంటర్వ్యూలు లేకుండానే మళ్లీ విధుల్లోకి తీసుకోవడం ఆనవాయితీగా వస్తోందని అధ్యాపకులు అంటున్నారు. ఇదే పద్ధతిన ఈ ఏడాది కృష్ణా యూనివర్సిటీలో అమలు చేసి, విధుల్లో చేర్చుకున్నారని, మళ్లీ ఇప్పుడు ఇంటర్వ్యూల పేరుతో తమను ఇబ్బంది పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని కాంట్రాక్టు అధ్యాపకులు వాపోతున్నారు.

బాండ్లు ఇస్తేనే ఇంటర్వ్యూ!

వర్సిటీతో పాటు, నూజివీడు పీజీ సెంటరులో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులంతా యూనివర్సిటీలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఇటీవల అధికారులు లేఖలు పంపారు. ఇంటర్వ్యూలకు వచ్చేముందు యూనివర్సిటీ అధికారులు తీసుకునే నిర్ణయాలకు కట్టుబడి ఉంటామని, కోర్టుకు వెళ్లబోమని బాండ్ రాసి ఇవ్వాలనే షరతు పెట్టారు. దీంతో ఇందులో ఏదో మతలబు దాగి ఉందని గ్రహించిన కాంట్రాక్టు అధ్యాపకులంతా చర్చించుకుని బాండ్‌లు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. పనితీరు బాగుండని ఒకరిద్దరిని పక్కనపెడితే తప్పులేదని, ఇంతకాలంగా పని చేస్తూ పరిశోధనాపత్రాలను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సమర్పిస్తున్న వారిని కూడా నిబంధనలకు విరుద్ధంగా తొలగించే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. తాము ఇంటర్వ్యూలకు హాజరయ్యేదిలేదని, ఏదైనా ఉంటే కోర్టులోనే తేల్చుకుంటామని కాంట్రాక్టు అధ్యాపకులు యూనివర్సిటీ అధికారులకు తేల్చిచెప్పారు. గత రెండు రోజులుగా జరగాల్సిన ఇంటర్వ్యూలకు ఎవ్వరూ హాజరుకాలేదు. రాష్ట్రంలోని ఏ యూనివర్సిటీలోనూ కాంట్రాక్టు అధ్యాపకులకు ఈ ఏడాది ఇంటర్వ్యూలు నిర్వహించలేదని, కృష్ణా యూనివర్సిటీలోనే నిర్వహించడం వెనుక కారణాలు ఏమిటని కాంట్రాక్టు అధ్యాపకులు వీసీతో మాట్లాడిన సమయంలో ప్రశ్నించారు. యూనివర్సిటీలో పనిచేసే రెగ్యులర్ ప్రొఫెసర్‌లలో అధిక శాతం మంది కాంట్రాక్టు అధ్యాపకుల డిమాండ్‌లకు బాసటగా నిలవడం గమనార్హం. నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టు అధ్యాపకులను తొలగిస్తే, యూనివర్సిటీలో పాఠ్యాంశాల బోధన కుంటుపడుతుందని, మిగిలిన యూనివర్సిటీలు కాంట్రాక్టు అధ్యాపకుల అంశంలో అనుసరించిన విధానాన్నే ఇక్కడ కూడా కొనసాగించాలని యూనివర్సిటీ రెక్టార్‌తోపాటు సీనియర్ ప్రొఫెసర్‌లు యూనివర్సిటీ వీసీ, రిజిస్ట్రార్‌తో జరిగిన సమావేశంలో స్పష్టం చేసినట్లు సమాచారం.

చెల్లించని జూన్ నెల జీతం

వర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు జూన్ నెల జీతం జూలై 20వ తేదీ వరకు చెల్లించలేదని సమాచారం. జీతాలు చెల్లించకుండా మళ్లీ ఉద్యోగం కావాలంటే బాండ్‌లు రాయాలని, ఇంటర్వ్యూకు హాజరుకావాలని, కోర్టును ఆశ్రయించమని ముందస్తు షరతులు పెడుతుండటంతో వారి భవిష్యత్ ఏమిటనే అంశంపైనా చర్చ నడుస్తోంది. వివిధ కోర్సుల్లో విద్యార్థినీ, విద్యార్థులు చేరే సమయమని, కాంట్రాక్టు అధ్యాపకుల విషయంలో ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటే విద్యార్థులు ఎలా చేరతారనే అంశాన్ని కాంట్రాక్టు అధ్యాపకులు, ప్రొఫెసర్‌లు తెరపైకి తెస్తున్నారు. యూనివర్సిటీ అధికారులు ఈ అంశంపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచిచూడాలి.



మంత్రి పార్థసారథిని సన్మానిస్తున్న యాదవ నేతలు

యాదవులకు చట్టసభల్లో సముచిత స్థానం

● యాదవుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పార్థసారథి

పెనమలూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): యాదవులకు చట్టసభల్లో ప్రముఖ స్థానం కల్పించింది టీడీపీ కూటమి ప్రభుత్వమేనని, బీసీలకు అండగా నాడు, నేడు టీడీపీ ఉందని మంత్రి కొలుసు పార్థసారధి పేర్కొన్నారు. ఆదివారం పోరంకి ఎల్ఎన్ గార్డెన్సులో జరిగిన యాదవుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సమ్మేళనంలో పాల్గొనడం ఆనందంగా ఉందని, యాదవ సోదరులంతా ఐక్యంగా ఉండి వ్యాపారంలో, రాజకీయంగా ఎదగాలని సూచించారు. యాదవుల వ్యాపారాలకు ప్రభుత్వం రూ.కోటి వరకు సబ్సిడీ రుణాలు అందిస్తుందని, అందుకు సహాయ సహకారాలు తాను ప్రభుత్వం తరపున అందిస్తానని, దీనిపై తనను నేరుగా కలవాలన్నారు. టీడీపీ అధ్యక్షుడు, ఆర్థిక మంత్రిత్వ శాఖ, వైద్య శాఖ, తన శాఖ పదవి యాదవులకే దక్కాయని, దీన్నిబట్టి కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు యాదవులకు ఇస్తున్న ప్రాముఖ్యతను అర్థం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా యాదవ సోదరులు మంత్రి పార్థసారధిని ఘనంగా సన్మానించారు.



పుస్తకావిష్కరణ సభలో మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్, చిత్రంలో ఏబీ వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు

గ్రామాభివృద్ధికి సర్పంచ్‌లకు సహకరించాలి

● మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు

ఉయ్యూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాన్ని అభివృద్ధి చేసుకునేందుకు సర్పంచ్‌లకు గ్రామస్థులు సహకరించాలని మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు అన్నారు. ముదునూరులో సంఘ సంస్కర్త నాగులపల్లి భాస్కరరావు ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటుచేసిన సర్పంచ్‌ల సదస్సులో 'లిటిల్ రిపబ్లిక్‌లుగా గ్రామాలు' పుస్తకాన్ని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్, ఎం నాగేశ్వరరావుతో కలిసి ఏబీ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన సర్పంచ్‌లను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామస్థులందరూ గ్రామసభల్లో పాల్గొని అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించి ప్రభుత్వం నుంచి సాధించుకోవాలని సూచించారు. వైవీబీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని, గ్రామాభివృద్ధి జరిగితేనే రాష్ట్రం, దేశానికి మేలు జరుగుతుందన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామసర్వాజ్య సాధనలో మనమందరం భాగస్వాములమవుదామన్నారు.జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గోలి వసంత కుమార్, ముదునూరు సర్పంచ్ మొవ్వ వెంకటనాగలక్ష్మి, జబర్లపూడి సర్పంచ్ శేషవర ప్రసాద్, సాయిపురం సర్పంచ్ జాన్‌బాషా పాల్గొన్నారు.



డిజిటల్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్వో చంద్రశేఖరరావు

ఏపీపీఎస్సీ పరీక్షా కేంద్రం డీఆర్వో సందర్శన

పెనమలూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వందడుగుల రోడ్డులో అయాన్ డిజిటల్ పరీక్ష కేద్రంలో ఆదివారం జరిగిన ఏపీపీఎస్సీ లెక్చరర్ల ఎంపిక పరీక్షా సరళిని జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్రశేఖరరావు పరిశీలించారు. అభ్యర్థులకు కేంద్రం ఏర్పాటు చేసిన సౌకర్యాలను తెలుసుకొన్నారు. అయాన్ డిజిటల్, పీవీపీ సిద్ధార్థ, ధనేకుల ఇంజనీరింగ్ కళాశాల, మచిలీపట్నంలోని హిందూ కళాశాలలో జరిగిన ఈ పరీక్షకు 903 మంది అభ్యర్థులకు 389 మంది అభ్యర్థులు మాత్రమే హాజరైనట్టు సమాచార పౌరసంబంధాల శాఖ అధికారులు తెలిపారు.

గుడ్లవల్లేరు పంచాయతీ అధికారికి నోటీసు

● నిధుల గోల్‌మాల్ కథనానికి స్పందన

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

గుడ్లవల్లేరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గుడ్లవల్లేరు గ్రామ పంచాయతీలో నిధులు గోల్‌మాల్ అన్న కథనానికి స్పందించిన డివిజనల్ పంచాయతీరాజ్ శాఖ అధికారి గుడ్లవల్లేరు గ్రామపంచాయతీ అధికారికి నోటీసు జారీచేశారు. సదరు వార్తపై జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారికి నివేదిక సమర్పించేందుకు ఈనెల 26న శనివారం గుడ్లవల్లేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో విచారణ నిర్వహించేందుకు నలుగురు పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి విచారణ నిర్వహించనున్నారు. ఈ బృందంలో ఆరుగొలను పంచాయతీ కార్యదర్శి పీ సురేష్ కుమార్, చిరిచింతల పంచాయతీ కార్యదర్శి కే అనూల, కలవపూడి అగ్రహారం పంచాయతీ కార్యదర్శి జే అవ్వమ్మ, జనార్ధనపురం కార్యదర్శి ఐ సందీప్ ఉన్నారు. 2021 ఏప్రిల్ 1 నుంచి నేటి వరకూ ఇంటిపన్నులు, పన్నేతర వసూళ్ల సొమ్ము, ఖర్చుల రికార్డులు, గ్రామపంచాయతీ యావత్తు రికార్డులను సిద్ధంగా ఉంచి విచారణకు హాజరు కావాలని పంచాయతీ కార్యదర్శిని కోరుతూ డివిజనల్ పంచాయతీ అధికారి నోటీసు జారీచేశారు.



సంఘం నూతన కార్యవర్గం

ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాంబాబు

తిరువూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ఎన్టీఆర్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం నిర్వహించారు. పట్టణంలోని శ్రీవాహిని ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఆర్ రాంబాబు (వత్సవాయి మండలం భీమవరం) ప్రధాన కార్యదర్శిగా ఈఎల్‌సీ కేశవరావు (ఎ.కొండూరు ఎంఈవో) కోశాధికారిగా సీహెచ్ వెంకటనారాయణ (కొండపల్లి) గౌవాధ్యక్షుడిగా పీఎస్ఎన్ రాజు (తిరువూరు), రాష్ట్రకౌన్సిల్ సభ్యుడిగా ఈ సుధాకర్ (విస్సన్నపేట ఎంఈవో) ఏ రాంబాబు, సుబ్రహ్మణ్యం, కేంద్ర కార్యదర్శిగా ఆర్ విజయరామారావు, ఎన్నికల అధికారులుగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెలమల శ్రీనివాసరావు, కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మా విజయ్ వ్యవహరించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	228
చికెన్ స్కిన్‌లెస్	238



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 520

విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి



ఉయ్యూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఉయ్యూరు సీఐ టీవీవీ రామారావు అన్నారు. ఏజీ అండ్ ఎస్ జీఎస్ కళాశాలలో నివాస్ కరాటే అండ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమి ఇండియా ఆధ్వర్యంలో కరాటే నేర్చుకున్న విద్యార్థులకు నిర్వహించిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతులు, సర్టిఫికెట్లు అందజేసే కార్యక్రమంలో సీఐ పాల్గొన్నారు. జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు జి.కృష్ణ, నివాస్ కరాటే అండ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమి ఇండియా అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు సీహెచ్ బాబూరావు

మరో విద్యుత్ పోరాటానికి సిద్ధం కావాలి: సీపీఎం

గన్నవరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ మీటర్లు పెట్టడం వెనుక విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేసే కుట్ర దాగి ఉందని, కరెంట్ బాదుడు పేరుతో జనం జేబులు కొట్టి అదాని జేబు నింపే పనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు అన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్య పార్క్ వద్ద ప్రజావేదిక ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లు వద్దు ట్రూ అప్ చార్జీలు రద్దు విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా సదస్సు జరిగింది. దీనికి ప్రజా వేదిక నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు, కాట్రగడ్డ జోషి అధ్యక్షత వహించారు. రాష్ట్ర నాయకులు బాబూరావు మాట్లాడుతూ, ఇప్పటికే కరెంటు బిల్లులు ఎన్ని రకాల అదనపు టాక్స్ లు వస్తున్నాయో తెలియడం లేదని, ఇకపై స్మార్ట్ బాదుడు కూడా తోడైతే కరెంటు వాడలేని పరిస్థితి వస్తుందన్నారు. ఈ సమావేశంలో ప్రజావేదిక నాయకులు సయ్యద్ అప్సర్, గన్నే వెంకట్రావు, అనుమోలు వెంకటేశ్వరరావు, బుద్ధవరం సర్పంచి బడుగు బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కానూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మురళీ నగర్ సబ్ స్టేషన్ 11కేవీ వినాయక్ నగర్ ఫీడర్ పరిధి కానూరు సెక్షన్‌లోని పలు ప్రాంతాల్లో సోమవారం ఉదయం 9నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ వంశీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వినాయక్‌నగర్, నవతా రోడ్డు, కేసీపీ స్కూల్ ఏరియాలో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

రెండు కేంద్రాల్లో పరీక్షలు

ప్రభుత్వ పాలిటెక్నిల్ కళాశాలల్లో లెక్చరర్ పోస్టుల భర్తీకి కంప్యూటర్ అధారిత పరీక్షలు ఆదివారం కానూరులోని పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల, అయాన్ డిజిటల్ జోన్ కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగాయి. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రశాంతగా పరీక్షలు నిర్వ హించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పరీక్షలు నిర్వహించినట్లు పరీక్షా కేంద్రాల నిర్వాహకులు తెలిపారు.

యనమలకుదురు లాకుల వద్ద మృతదేహం గుర్తింపు

పెనమలూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : యనమలకుదురు లాకుల వద్ద గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. షుమారు 45ఏళ్ల వ్యక్తి మృతదేహం లాకులు 3వ స్తంభం వద్ద ఉన్న ట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు అప్రమత్తమై వెళ్లి పరిశీలించారు. మృతదేహంపై లేత బీజ్‌రంగు ఫుల్‌హ్యాండ్స్ షర్టు ఉందని, శరీరం పూర్తిగా కుళ్లిన దశలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంగానమ్మతల్లికి ఘనంగా ఆషాఢ సారె

హనుమాన్‌జంక్షన్ / రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : గోవింద నామ సేవా సంఘం ఆధ్వర్యంలో బాపులపాడు, కె.సీతారాంపురంలో గ్రామదేవత గంగానమ్మ తల్లికి ఆదివారం ఘనంగా ఆషాఢ సారె సమర్పించినట్లు ధర్మ ప్రచారక్ యడవల్లి పాండురంగారావు తెలిపారు. ఆయా గ్రామాల్లోని కోదండ రామాలయాల్లో పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, నూతన వస్త్రాలతో కూడిన ఆషాఢ సారెకు ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో గూడవల్లి చిన్నా, రాజా, గూడపాటి రత్నశేఖర్, మజ్జి శ్రీనివాసరావు, గ్రామ భక్తి బృంద సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

తిరుపతమ్మ, గోపయ్యస్వామి ఆలయంలో..

హనుమాన్‌జంక్షన్‌రూరల్: లోక కల్యాణార్థం వీరవల్లిలో కొలువైన తిరుపతమ్మ, గోపయ్యస్వామి వార్లకు శాకంబరి ఉత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో దేవర్లను వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. దేవస్థాన ప్రాగణంతో పాటు అంకమ్మదేవిని కూడా వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. దేవస్థాన ధర్మకర్త నందమూరి మురళీకృష్ణప్రసాద్, లంక రవిశ్రీనివాస్, పీఏసీఎస్ అధ్యక్షుడు కలపాల నాని, ఆత్కూరి బాలాజీ, కలపాల శ్రీనివాసరావు, శ్రీకాంత్, కాకర్ల గిరిధర్, తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అంకమ్మతల్లికి బోనాలు

గన్నవరం: పాతగన్నవరంలోని లక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో ఉపదేవత అంకమ్మ తల్లికి ఆషాఢమాసం చివరి ఆదివారం సందర్భంగా భక్తులు బోనాలను సమర్పించారు. తొలుత బోనాలను నెత్తిన పెట్టుకుని భక్తులు ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అంకమ్మతల్లికి బోనాలు సమర్పించారు.

ఆదమరిచారా.. సెల్ చెల్!

- ● జంక్షన్ బస్టాండ్‌లో ప్రయాణికులే లక్ష్యంగా జేబు దొంగల చేతివాటం
- ● నిత్యం సెల్‌ఫోన్ల అపహరణ
- ● నేరగాళ్లకు ఆవాస కేంద్రంగా పాత బస్టాండ్ ఆవరణ
- ● పట్టించుకోని పోలీసులు



నేరగాళ్లకు అవాస కేంద్రంగా మారిన జంక్షన్ పాత బస్టాండ్

(హనుమాన్‌జంక్షన్ - ఆంధ్రజ్యోతి)

జంక్షన్ ఆర్టీసీ బస్టాండ్ జేబు దొంగలకు నిలయంగా మారింది. బస్టాండ్ కు వచ్చిన ప్రయాణికుల జేబులు, సంచుల్లో ఉన్న విలువైన సెల్‌ఫోన్‌లు, బంగారు ఆభరణాలు అపహరణకు గురవుతున్నాయి. దొంగలు ప్రయాణికులను గమనిస్తూ బస్సు ఎక్కేటపుడు రద్దీగా ఉన్న సమయంలో ప్రయాణికుల్లా ముందే ఎక్కి ఎదురు దిగుతు చొక్కా జేబుల్లో ఉన్న సెల్‌ఫోన్‌లు అపహరిస్తున్నట్లు బాధితులు చెబుతున్నారు. గతంలో అనేక మార్లు మహిళల హ్యాండు బ్యాగుల్లో ఉన్న బంగారు ఆభరణాలు అపహరణకు గురైన సందర్భాలు కూడా ఉన్నాయి. జంక్షన్ పోలీస్ స్టేషన్‌లో అనేక మంది బాధితులు ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు.

సీసీ కెమెరాలు లేవు

బస్టాండ్‌ను గత వైసీపీ ప్రభుత్వం హయాంలో రూ.4కోట్ల అంచనా వ్యయంతో నూతన భవనం నిర్మించారు. 10 ప్లాట్‌ఫాంలతో అభివృద్ధి చేసి సౌకర్యవంతంగా నిర్మించారు. గతేడాది ప్రారంభిం చారు. ప్రతి రోజు 5వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఏదోక ప్లాట్‌ఫాం వద్ద దొంగలు ప్రయాణికుల జేబులకు చిల్లులు పెడుతునే ఉన్నారు. పోలీస్ కానిస్టేబుల్ బీట్‌లో ఉన్న దొంగతనాలు మాత్రం ఆగని పరిస్థితి నెలకొంది. కోట్లాది రూపాయలు వెచ్చించి ఆధునిక హంగులతో నిర్మించిన బస్టాండ్‌లో అధికారులు సీసీ కేమెరాలు ఏర్పాటు చేయడం మరిచారు.

నేరగాళ్ల షెల్టర్‌గా పాత బస్టాండ్

కొత్త బస్టాండ్ నిర్మించిన తరువాత నిరుపయోగంగా పక్కనే ఉన్న పాత బస్టాండ్ ఆవరణ నేరగాళ్లకు ఆవాస కేంద్రంగా మారింది. అనుమానిత వ్యక్తులు, యాచకులు, గంజాయి తాగుతు, బొనోఫిక్స్ పీల్చుతు బస్టాండ్ ఆవరణలో సంచరిస్తూ అక్కడే నిద్రపోతు చోరీలకు పాల్పడడానికి ఆవాస కేంద్రంగా మారిందని ప్రయాణికులు వాపోతున్నారు.

దాతల సాయంతో సీసీ కెమెరాలు

బస్టాండ్‌లో జేబు దొంగలను నివారించడానికి అనుమానితులను కట్టడి చేయడానికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి నిధులు కొరతగా ఉందని గన్నవరం డిపో మేనేజర్ శివాజీ తెలిపారు. దాతల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. పోలీసుల నిఘా పెంచుతామని తెలిపారు.

- డిపో మేనేజర్ శివాజీ

కూటమి హయాంలోనే సూపర్ పాలన

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్




గొడవర్రులో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే బోడె ప్రసాద్.. ముదునూరులో..

కంకిపాడు, జులై 20 (ఆంధ్రజ్యోతి) : కూటమి హయాంలో ప్రజలకు సుపర్ పాలన అందిస్తున్నామని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని గొడవర్రులో ఆదివారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో జరుగుతున్న స్పష్టమైన మార్పును ప్రజలు గమనిస్తున్నారని, ఒక్క గొడవర్రులోనే రూ.4.50 కోట్లతో గ్రామాభివృద్ధి జరిగిందన్నారు. గత ముఖ్యమంత్రి జగన్ కంటే అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వంలో అధికంగానే అందిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అభివృద్ధి ఘనంగా చేసి చూపించారన్నారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. గత ప్రభుత్వం అరాచక పాలన నుంచి రాష్ట్రాన్ని గాడిలో పేట్టేందుకు సీఎం చంద్రబాబు విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజా, కోనేరు భాను, తుమ్మలపల్లి హరికృష్ణ, అనుమోలు ప్రభాకర్, కోయా ఆనంద్, కోనేరు రాజేష్, పులి శ్రీనివాసరావు, సాంబశివరావు, యార్లగడ్డ బోసు, నాగరాజు, గొగినేని వెంకటరమణ, కొండా నాగేశ్వరరావు, చిట్టూరి నాగేశ్వరరావు, వణుకూరు విక్రం, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ముదునూరులో..

ఉయ్యూరు : సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తూ సీఎం చంద్రబాబు ఎన్నికల హామీని నిలబెట్టుకుం టున్నారని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి అన్నారు. ముదునూరులో ఆదివారం మాజీ సర్పంచ్ మొవ్వ జ్ఞానశేఖర్‌తో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. వి.రామకృష్ణ, పిచ్చేశ్వరరావు, పల్లపోతు శ్రీనివాసరావు, మురళి, నాగమణి, రాము తదితర స్థానిక నాయకులు పాల్గొన్నారు.

యనమలకుదురులో..

పెనమలూరు : యనమలకుదురు మూడవ క్లస్టరు ఇన్‌చార్జి అనంతనేని ఆజాద్ ఆధ్వర్యంలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి పథకాలను వివరించే కరపత్రాలను స్థానికులకు పంపిణీ చేశారు. కాలనీ వాసులు ఎప్పటి నుంచో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు నెల రోజుల్లో టెండర్లు పిలిచి నిర్మాణాలు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో 14వ డివిజన్ అధ్యక్షుడు తమ్ము అశోక్ చక్రవర్తి, కళ్యాణపు శ్రీనివాసరావు, మహబూబ్ బాషా, సోంబాబు, రాము, శ్రీనివాసరావు, మస్తాన్, సుంకర చినబాబు, వెలగపూడి రాజశేఖర్, మాచిన శివకుమార్, మదిర శేషగిరిరావు, దూసనపూడి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కానూరు, సనత్‌నగర్‌లో..

కానూరు : తాడిగడప మునిసిపాలిటీ కానూరు, సనత్‌నగర్ రామాలయం ప్రాంతంలో ఆదివారం టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు పార్టీ శ్రేణులతో కలిసి సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఆయన ఇంటింటికి తిరిగి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలియజేసే కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శంకరబాబు మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొనే సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నేతలు షేక్ ఇమామ్, రియాజ్, పువ్వాడ రమేష్, రామకృష్ణ, శ్రీహరి పాల్గొన్నారు.




యనమలకుదురులో జరిగిన కార్యక్రమంలో అనంతనేని ఆజాద్.. కానూరు సనత్‌నగర్ రామాలయం ప్రాంతంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న శంకరబాబు

తాడిగడప మునిసిపాలిటీలో

రూ.12.29 కోట్ల ఆస్తిపన్ను వసూలు



మునిసిపల్ కమిషనర్ షేక్ నజీర్

కానూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప మున్సిపాలిటీలో ఈ ఆర్థిక సంవత్సరానికి గాను ఇప్పటి వరకు రూ. 12.29 కోట్లు ఆస్తిపన్నును వసూలు చేసినట్లు మునిసిపల్ కమిషనర్ షేక్ నజీర్ చెప్పారు. ఆదివారం ఆయన ఆంధ్ర జ్యోతితో మాట్లాడుతూ, మునిసిపల్ పరిధి పోరంకి, తాడగడప, కానూరు, యనమలకుదురు గ్రామాల్లో మొత్తం 49వేలు హౌస్‌హోల్డ్స్ (అసెస్ మెంట్)ల నుంచి రూ. 25.26 కోట్లు ఆస్తిపన్ను ఈ ఏడాదికి రావాలసి ఉందన్నారు. ఇప్పటి వరకు 48.6 శాతం వసూలయిందని ఆయన పేర్కొన్నారు. ఆస్తిపన్నును పోరంకి, తాడిగడప, కానూరు, యనమలకుదురు సచివాల యం-1లో లేదా ఆన్‌లైన్‌లో కూడా చెల్లించ వచ్చని తెలిపారు. ఈ మేరకు సంబంధిత గ్రామాల్లో ప్రచారం కూడా నిర్వహిస్తున్నా మని వివరించారు. ఖాళీ స్థలాల పన్ను కూడా వసూలు చేస్తున్నామని చెబుతూ 2022 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 1341 ఖాళీ స్థలాల ద్వారా రూ. 2.90 కోట్లు వసూలు చేశామని పేర్కొన్నారు. పన్నులు చెల్లించని ఖాళీ స్థలాలను వెతికే బాధ్యతను మున్సిపల్ సిబ్బందికి అప్పగించామని, గుర్తించిన స్థల యజమానులకు నోటీసులు జారీ చేసి ఖాళీస్థలాల పన్నును వసూలు చేస్తామని కమిషనర్ షేక్ నజీర్ వివరించారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో రూ.13.3 లక్షలకు టోకరా

పెనమలూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో రూ. 13.3లక్షల దోపిడీపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. కానూరు పిన్నమనేని టీచర్స్ కాలనీకి చెందిన న్యాయవాది వడ్లమూడి కృష్ణకు మార్చి 9న (సీ3)ఐసీఐసీఐ స్టాక్ ఎక్స్చేంజి గ్రూప్ పేరుతో వాట్సాప్ గ్రూప్ ఆహ్వానం రాగా దానిని ఐసీఐసీఐ సెక్యూరిటీస్‌తో లింక్ చేయబడిన గ్రూప్‌గా భావించి దాన్ని చట్టపరమయిన గ్రూప్ అని నమ్మాడు. అవతలివారు చెప్పిన ప్రకారం కృష్ణ తన కేవైసీని ఇవ్వగా వారి నుంచి ట్రేడింగ్ ఐ ఈ, పాస్‌వర్డు వచ్చింది. అవతలివారు చెప్పినట్లు అనేక సార్లు విడతల వారీగా 13,30,500 రూపాయలను వారికి బదిలీ చేశాడు. కొన్నాళ్ల తర్వాత తాను డిపాజిట్ చేసిన సొమ్మును విత్‌డ్రా చేయడానికి ప్రయత్నించగా అవి విత్‌డ్రా కాలేదు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన కృష్ణ శనివారం పెనమలూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

నాయకత్వ లక్షణాలు అలవరుచుకోవాలి

నారాయణ పాఠశాలల ఏజీఎం మురళీకిషోర్



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏజీఎం మురళీకిషోర్

పెనమలూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచే క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను అలవరుచుకొని ఉన్నత స్థానాలను అందుకోవాలని కృష్ణాజిల్లా నారాయణ పాఠశాలల ఏజీఎం మురళీకిషోర్ పేర్కొన్నారు. ఆదివారం ఈడుపుగల్లు నారాయణ పాఠశాలలో జరిగిన కేబినెట్ ప్రతిష్టాపన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. బాల్యం నుంచే విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను, పెద్దల పట్ల గౌరవాన్ని ప్రతి నారాయణ పాఠశాలలో నేర్పిస్తున్నామని తెలిపారు. అత్యంత అనుభవం కలిగిన అధ్యాపకులతో శిక్షణ ఇప్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ముందుగా జ్యోతిప్రజ్వలన గావించి కేబినెట్ నూతన సభ్యులకు బ్యాడ్జ్‌లు అలంకరించి విద్యార్థులను అభినందించారు. అకడమిక్ డీన్లు కిరణ్‌బాబు, అజయ్, ఏవో శేషగిరిరావులు మాట్లాడుతూ పాఠశాలలో క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాళ్లు కొండా తిరుమలరావు, శ్రీహర్ష, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీడీపీ నేత యనమదలకు పరామర్శ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఊపిరితిత్తుల వ్యాధితో చికిత్స పొందుతున్న మల్లవల్లి టీడీపీ సీనియర్ నేత యనమదల వెంకయ్యారావును ఎస్ఎంసీ చైర్మన్ అచ్చి రమేష్ ఆదివారం పరామర్శించారు. హైదరాబాద్‌లోని బసవతారకం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకయ్యారావును కలిసి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. అత్యుత్తమ చికిత్స అందుతోందని, కోలుకుని త్వరలోనే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటానని వెంకయ్యారావు అన్నట్లు వారు తెలిపారు. వేముల కాసులు, అచ్చి శ్రీను, లవరాజు, తదితరులు పాల్గొన్నారు.



వేలేరు పీఏసీఎస్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

రైతులకు మెరుగైన సేవలందించాలి

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రైతుల అవసరా లను గుర్తెరిగి పీఏసీఎస్‌ల ద్వారా మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సూచించారు. ఆదివారం వేలేరు పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా అవిర్నేని భవానీ శంకర్, డైరెక్టర్లు పదవీ బాధ్యతలు స్వీకరించే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. చైర్‌పర్సన్ భవానిశంకర్, డైరెక్టర్లు వీరవల్లి రంగరావు, తిరువీధి మరియదాసులతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం రాష్ట్ర రైతు సమాఖ్య కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులు పంట సాగుకు సకాలంలో నీరందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేన్నారు. ఈ కార్యక్రమంలో జీఎం చంద్రశేఖరరావు, కేడీసీసీ బ్యాంకు సీఈవో శ్యాంమనోహర్ హనుమాన్‌జంక్షన్ చీఫ్ మేనేజర్ అవినాష్, టీడీపీ నాయకులు దయాల రాజేశ్వర రావు, మూల్పూరి సాయికళ్యాణి, పుట్టా సురేష్, కాజ సురేష్, అండగాల సీతారామ స్వామి, డీసీ చైర్మను పాల్గొన్నారు.



ఉయ్యూరు పీఏసీఎస్ పాలకవర్గంతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, వైవీబీ రాజేంద్రప్రసాద్

పదవులు బాధ్యతను పెంచుతాయి

ఉయ్యూరు: పదవులు అలంకారప్రాయంగా భావించకుడా బాధ్యతగా సేవలందించేందుకు ఉపయోగించి పేరు ప్రఖ్యాతులు గడించాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఉయ్యూరులో పీఏసీఎస్ చైర్‌పర్సన్ కూనపరెడ్డి శ్రీనివాసరావు, ఇతర సభ్యులతో ఆదివారం స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో ప్రమాణస్వీకారం చేయించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, సహకార సంఘాల ద్వారా రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలు, ఇతర సదు పాయాలను అందరికి అందించేలా పాలకవర్గం పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉయ్యూరు చైర్మన్ వి.సత్యనారాయణ, మాజీ చైర్మన్లు జంపాన పూర్ణచంద్రరావు, ఖుద్దూస్, యెనిగళ్ల కుటుంబరావు, గుర్నాధరావు, ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూరి చౌదరి, షరీఫ్ పాల్గొన్నారు.



సాగునీటికి అడ్డంకిగా ఉన్న వృక్షాన్ని తొలగించాలి

కూచిపూడి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆవిరిపూడి - చినముత్తేవి గ్రామాల మధ్య పంట కాలువలో అడ్డంకిగా ఉన్న వృక్షాన్ని తొలగించాల్సిందిగా ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. గాలి వాన కారణంగా భారీ వృక్షం నెలకొరిగి పంట కాలువలోని నీటికి అడ్డంగా ఉండటం వల్ల దిగువ ప్రాంతాలకు సాగునీరు వెళ్లక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఖరీఫ్ పనులు ప్రారంభమైన నేపథ్యంలో రైతుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని వృక్షాన్ని తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



పంట కాలువలో అడ్డంగా కూలిన వృక్షం

ఈ రోడ్డుపై ప్రయాణం నరకం

- ఆర్‌అండ్‌బీ రోడ్డు గోతులమయం
- గోతులతో తప్పని తిప్పలు
- నిధులు మంజూరైతేనే అభివృద్ధి

(ఆంధ్రజ్యోతి - తోట్లవల్లూరు) : తోట్లవల్లూరు - ఉయ్యూరు ఆర్‌అండ్‌బీ రోడ్డులో ప్రయాణం నరకాన్ని తలపిస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. వర్షాకాలం రావటంతో పాత గోతులు భారీ గోతులుగా తయారయ్యాయి. ఈ గోతుల్లో వాహనాలను నడపలేక పోతున్నామని డ్రైవర్లు చెబుతున్నారు. తోట్లవల్లూరు నుంచి ఉయ్యూరు ఆర్టీసీ బస్టాండు వరకు సుమారు 8 కిలో మీటర్ల రోడ్డు ఉంది. వైసీపీ హయాంలో సుమారు రూ.4 కోట్లతో యాకమూరు నుంచి తోట్లవల్లూరు వంతెన దిగువన నాలుగు కిలోమీటర్ల వరకు తారురోడ్డు నిర్మించారు. ఈ తారురోడ్డు నిర్మాణంలో భాగంగా నాలుగు చోట్ల పాత కల్వర్టులు తొలగించి కొత్తవి నిర్మించాల్సి ఉన్నా అలాగే వదిలివేశారు. యాకమూరు దగ్గర్లో రెండు కల్వర్టులు, కొబ్బరి చెట్టు డొంకవద్ద మరో కల్వర్టు, బందరు కాలువ వంతెన దాటిన తరువాత నాలుగో కల్వర్టుని నిర్మించకుండా వదిలివేశారు. ఆ పాత కల్వర్టుల వద్ద ద్విచక్ర వాహనాలు ప్రమాదాలకు గురై చాలామంది గాయాల బారిన పడ్డారు.

వైసీపీ హయాంలో అభివృద్ధి చేయకుండా వదిలేసిన రోడ్డు మరమ్మతులకు కూటమి ప్రభుత్వం వచ్చాక రూ. 40 లక్షలు కేటాయించి కనకదుర్గమ్మ కాలనీ వద్ద పెట్రోల్ బంకు నుంచి బందరు కాలువ వంతెన వైపు 4వ కిలో మీటరు వరకు ప్యాచ్‌వర్క్ కింద తారురోడ్డు నిర్మించారు. అయితే పెట్రోల్ బంకు నుంచి తోట్లవల్లూరు కేఈబీ కెనాల్ వంతెన వరకు రోడ్డును ఈ ప్యాచ్ వర్కుల్లో చేర్చలేదు. దీంతో రోడ్డు గోతులమయంగా తయారయింది. ప్రస్తుతం వర్షాలతో పాత గోతులు భారీ గోతులగా ఏర్పడ్డాయి. ఈ గోతుల్లో ఆటోలు, ద్విచక్ర వాహనాలు ప్రమాదాల భారీన పడక తప్పడం లేదు. తోట్లవల్లూరు మొయిన్ సెంటర్‌లోను, మండల పరిషత్ కార్యాలయం వద్ద, దళితవాడ వద్ద విపరీతమైన గోతులు ఏర్పడ్డాయి. ఇప్పటికైనా సదరు అధికారులు ఈ గోతుల్లో చిన్న కంకర పోసి ప్యాచ్‌వర్కులు చేసి, సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



4వ కిలో మీటరు వద్ద ఏర్పడిన గోతులతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ప్రమాదకరంగా ఏర్పడిన పెద్ద గొయ్యి

రూ. 4.20 కోట్లతో అంచనాలు పంపాం

తోట్లవల్లూరు - ఉయ్యూరు ఆర్‌అండ్‌బీ రోడ్డులో మిగిలిపోయిన రోడ్డు అభివృద్ధికి రూ. 4.20కోట్లతో అంచనాలు రూపొందించి పంపించాం. తోట్లవల్లూరులో ఒక కిలోమీటరు సీసీ రోడ్డుకి, ఉయ్యూరు బస్టాండ్ నుంచి యాకమూరు వరకు తారురోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించాం. గతంలో కల్వర్టులు నిర్మించాల్సి ఉందని, ఇపుడు కొత్త కల్వర్టుల నిర్మాణాన్ని రద్దు చేశారు.

మల్లిఖార్జునరావు, ఆర్‌అండ్‌బీ ఏఈ

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

● ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా



పామర్రులో..

పామర్రు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని స్థానిక 19వార్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆ వార్డు పరిధిలోని గుడివాడ రోడ్డు మురుగు డ్రెయినేజీ ప్లాస్టిక్ ఇతర వ్యర్థాలతో అధ్వానంగా తయారైంది. దీనికితోడు పామర్రు-నర్సాపురం జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ప్రధాన డ్రెయినేజీ వ్యవస్థ దెబ్బతినడంతో వర్షం కాలంలో పట్టణంలోని ఐదు వార్డుల్లోని మురుగు ఆ డ్రెయినేజీ ద్వారా బయటకు పోకుండా ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా మారింది. ఈ సమస్యను పరిష్కరించాలని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసురావడంతో స్పందించిన ఎమ్మెల్యే జాతీయ రహదారులశాఖ గుత్తేదారునితో మాట్లాడి యుద్ధప్రతిపాదికన ఎక్సకవేటర్‌తో డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుదల పనులను ప్రారంభించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తంచేశారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అన్ని వర్గాలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మంతెన రామాంజనేయులు, వెంకటేశ్వరరావు, కొమరవోలు సాగునీటి సంఘ ఉపాధ్యక్షుడు మధు, మోహనరావు, సుబ్రమణ్యం, రాజు, దాలిపర్తి ప్రసాద్, సురేష్‌రమేష్, సందీప్ పాల్గొన్నారు.

గుడివాడ రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం పేద, బడుగు, బలహీనవర్గాలకు అండగా ఉంటుందని గుడివాడ మార్కెట్ యార్డు చైర్మన్ చాట్రగడ్డ రవి అన్నారు. శనివారం రాత్రి సీపూడి, కాసిపూడి గ్రామాల్లో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి టీడీపీ నాయకులు తిరిగి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల బ్రోచర్లను పంపిణీ చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి మహిళలతో, యువతతో మాట్లాడి కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ప్రతి అభివృద్ధి, సంక్షేమ పథకాలపై దృష్టి సారించిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వాసే మురళీ, గుడివాడ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ సుబ్బారావు, సాంబశివరావు, బసవయ్య, కుటుంబరావు, జనార్ధన్, చప్పిడి ఏడుకొండలు, నాగేశ్వరరావు, సూర్యనారాయణ, మాడపాటి నాగరాజు, నీలిపాల నాగరాజు, సింగనాల రాధాకృష్ణ, రషీద్ బేగ్, కైలే రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



పమిడిముక్కలలో ప్రజాసమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కుమార్ రాజా



గుడివాడ రూరల్‌లో..

పమిడిముక్కల : సంక్షేమం, అభివృద్ధి, పెట్టుబడులు తీసుకువచ్చి యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పన కూటమి త్రిశూల వ్యూహం కాగా వైసీపీది తుస్సు వ్యూహమని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ఎద్దేవ చేశారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా కూడేరు శివారు నిమ్మితలకుంటలో పర్యటించి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించి, ప్రజాసమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వర్షాలు తగ్గిన తరువాత కొత్తరోడ్డు వేసేలా చర్యలు తీసుకుని రోడ్డు ప్రారంభోత్సవానికి వస్తానని హామీ ఇచ్చారు. వీధిలైట్లుల వెలిగేల చూడాలని కార్యదర్శిని ఆదేశించారు. మండల పార్టీ అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



వైద్యసేవలందిస్తున్న సిద్ధార్థ కళాశాల వైద్యులు

ఉచిత వైద్య శిబిరం

గుడివాడ, జూలై 20(ఆంధ్రజ్యోతి) : స్థానిక కోతిబొమ్మసెంటర్‌లోని ప్రభావతి గార్డెన్స్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో చినఅవుటుపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. త్రిపురనేని లక్ష్మీ పెరుమాళ్లు, చలసాని రాయన్ చౌదరిల జ్ఞాపకార్థం నిర్వహించిన వైద్య శిబిరంలో వైద్యులు రమణిరెడ్డి, తరుణ్ కుమార్‌రెడ్డి, వి.సాత్విక, నరసింహారావు, కొల్లి విహారీలు వైద్య సేవలందించి ఉచితంగా మందులను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్లు డాక్టర్ సి.సూర్యచంద్రరావు, క్లబ్ అధ్యక్షుడు యలమంచిలి నాగేశ్వరరావు, అసిస్టెంట్ గవర్నర్ శ్రీనివాస్, ఏజే ప్రసాద్, గుళ్లపల్లి కిరణ్‌బాబు, సుబ్రహ్మణ్యేశ్వరరావు, మారుతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సేవ చేయడంలోనే సంతృప్తి

● డాక్టర్ రమేష్‌కుమార్

గుడ్లవల్లేరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : సాయం చేయడంలో ఉన్న ఆనందం వేరేచోట లేదని, బొప్పన శరత్‌గోపాల్ ఫౌండేషన్ స్థాపించి తద్వారా సేవాకార్యక్రమాలను కొనసాగిస్తున్న వారి కుటుంబ సభ్యులు అభినందనీయులు అని మధ్యప్రదేశ్ ఎస్సీ, వెనకబడిన తరగతుల, మైనారిటీ వెల్ఫేర్ శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ రమేష్‌కుమార్ అన్నారు. బొప్పన శరత్‌గోపాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పెంజంద్రలో నిర్వహించిన మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. పలుగ్రామాలకు చెందిన దివ్యాంగులకు ట్రై సైకిళ్ళను రమేష్ కుమార్, శరత్‌గోపాల్ కుటుంబ సభ్యుల చేతులమీదుగా అందజేశారు. నేత్రవైద్య పరీక్షల్లో అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లను శరత్ గోపాల్ ఫౌండేషన్ చైర్మన్ ఝాన్సీరాణి, ఆయన కుమారుడు బొప్పన తారాచంద్‌లు పంపిణీ చేశారు. గుండె, నరాలు, ఎముకలు, మెదడు, నేత్రాలు, చెవి, ముక్కు, గొంతు, దంతాల విభాగాలలో, సాధారణ వైద్యపరీక్షలు నిపుణులైన వైద్యులచే పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈసీజీ, 2డి ఎకో పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. దాదాపుగా 1680 మంది రోగులను వివిధ విభాగాలలో వైద్యులు పరీక్షలు నిర్వహించారు. వైద్యశిబిరానికి వచ్చిన రోగులు అందరికీ అన్నదానం శరత్‌గోపాల్ కుటుంబ సభ్యులే స్వయంగా భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ బొప్పన ఝాన్సీరాణి, బొప్పన తారాచంద్, కుసుమ, నాదెళ్ల కావ్య, నాదెళ్ల నందీప్, రవీంద్ర, గ్రామస్తులు బొప్పన జగన్మోహనరావు, బొప్పన శివప్రసాద్, బొప్పన కిషోర్, బొలుసు జితేంద్ర, సంధ్యారాణి, కోటేశ్వరరావు, బ్రహ్మం, వల్లభనేని సీతారామ్, రమేష్, చాపరాల రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేస్తున్న శరత్‌గోపాల్ కుటుంబసభ్యులు

గంగానమ్మకు ఆషాఢసారె



గంగానమ్మకు సారెను తీసుకువెళుతున్న మహిళలు

గుడ్లవల్లేరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : అంగలూరు జ్ఞాన సాయి మందిరం నుంచి గ్రామ దేవత గంగానమ్మ అమ్మవారికి ఆషాఢ సారెను సమర్పించారు. జ్ఞానసాయి మందిరం నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఈ సారెను సాయిభక్తులు, గ్రామ మహిళలు సాయి ఆలయం నుంచి మేళతాళాలు,మంగళ వాయిద్యాలతో సారెను గ్రామోత్సవం నిర్వహిస్తూ గంగానమ్మ అమ్మవారి ఆలయానికి తీసుకెళ్లారు. ఆషాఢ సారెను అమ్మవారికి సమర్పించారు.

పెదపారుపూడి : మోపర్రులోని వన్నేరులో వెలసిన గంగానమ్మకు బోనాలు ఆదివారం సమర్పించినట్టు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ బోయిన సాంబశివరావు తెలిపారు. ఈ సందర్భంగా శివయ్య మాట్లాడుతూ గ్రామ ప్రముఖులు, హైదరాబాద్‌లో న్యాయవాది సీతం రాజు రామారావు (రాము) వృత్తిపరంగా స్థిరపడి మోపర్రును దత్తత తీసుకున్నారు. ఆ గ్రామానికి కావాల్సిన సిమెంట్ రోడ్లు, వాటర్ ఆర్వో ప్లాంట్, కల్యాణ మండపం, గంగానమ్మ దేవాలయం తదితర అభివృద్ధి పనులు తన సొంత నిధులు వెచ్చించి చేయించారు. 2012వ సంవత్సరం నుంచి ప్రతీ ఏటా గంగానమ్మకు బోనాలు సమర్పిస్తూ ముందుకు సాగుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ భక్తులతోపాటు ఇతర గ్రామ, రాష్ట్రాల నుంచి అనేక మంది భక్తులు ముఖ్యంగా మహిళలు వచ్చి గంగానమ్మకు బోనాలు సమర్పించనున్నారని తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ వారిచే భక్తులకు అన్నసమారాధన చేశారు. టీడీపీ నాయకులు అనిల్ కుమార్ పాల్గొన్నారు.



పెదపారుపూడిలో బోనాలు సమర్పించేందుకు వెళ్తున్న భక్తులు

కూచిపూడిలో ముమ్మరంగా వరినాట్లు

కూచిపూడి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మొవ్వ మండలంలో వరి నాట్లు వేసే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. శనివారం రాత్రి విస్తారంగా కురిసిన వర్షం నారుమడులకు జీవం పోయటంతోపాటు నాట్లు ముమ్మరంగా సాగటానికి తోడ్పడ్డాయి. కూచిపూడి, మొవ్వ, కారకంపాడు, నిడుమోలు , పెననగల్లు, భట్లపెనుమర్రు, ఆవిరిపూడి, పెదముత్తేవి తదితర గ్రామాల్లో నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. తీవ్ర ఉష్ణోగ్రతలతోపాటు వరుణ దేవుడు కరుణించకపోవటంతో ఖరీఫ్ పనులు సాగేదెట్లా అని రైతులు తీవ్ర నిరాశ చెందారు. ఈ నేపథ్యంలో కురిసిన కుండపోత వర్షం కారణంగా ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగటానికి ఆస్కారం ఏర్పడింది. మరో రెండు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయన్న సమాచారంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మొవ్వ మండలంలో 11250 హెక్టార్లలో ఈ ఏడాది వరి నాట్లు వేసేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు.



కూచిపూడిలో నాట్లు వేస్తున్న మహిళా కూలీలు

తటాకంలా అండర్‌పాస్ హైవే

పమిడిముక్కల, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ- మచిలీపట్నం జాతీయరహదారిలో తాడంకి వద్ద అండర్‌పాస్ వర్షపునీటితో చెరువులా తయారవడంతో రాకపోకల సమయంలో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అండర్‌పాస్ నుంచి వర్షపునీరు పోయే మార్గం లేక చిన్నపాటి వర్షానికి సైతం నీరునిలిచిపోతుంది. రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అండర్‌పాస్‌లో మోకాలు లోతుకు పైగా నీరు నిలిచింది. మధ్యలో పెద్ద గుంత ఏర్పడగా ద్విచక్రవాహనాలపై వెళ్లేవారికి కన్పించక గుంతలో పడి ప్రమాదానికి గురవుతున్నారు. అండర్‌పాస్‌లో ఎల్లప్పుడు నీరు నిలిచి చెరువులా ఉండటంతో ఇబ్బంది పడుతున్నామని పరిసరగ్రామాల ప్రజలు ప్రజాప్రతినిధులు, అధికారులకు మొరపె ట్టుకున్నా పట్టించుకున్న వారు లేరని ఆందోళన చెందుతున్నారు. వర్షాకాల ప్రారంభమై వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు స్పందించి చర్యలుతీసుకోవాలని కోరుతున్నారు.



వర్షపు నీటితో నిండిన నేషనల్ హైవే అండర్‌పాస్

గొడవలకు దూరంగా ఉండాలి : సీఐ

గుడివాడ, జూలై 20(ఆంధ్రజ్యోతి) : అనుకోని కొన్ని సంఘటనల వల్ల, దురుసుగా ప్రవర్తించి, చెడు వ్యసనాలకు బానిసలై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, గొడవలకు దూరంగా ఉండి మంచి మనుషుల్లా మెలగాలని వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ గంగాధరరావు ఆదేశాల మేరకు డీఎస్పీ ధీరజ్ వినీల్ పర్యవేక్షణలో రౌడీషీటర్లు, అనుమానిత షీటర్‌లకు కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. అనవసరమైన గొడవల్లో తలదూర్చవద్దని, సమాజంలో మంచిగా మెలగాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి చప్టా, ఫెన్సింగ్ ధ్వంసంపై కేసు నమోదు

గుడివాడ : గేదెలు ఇంటి ముందు నుంచి వెళుతుండటంతో ఇబ్బందిగా ఉందని, గేదెల యజమాని వీర్ల రవీంద్రపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక కాకతీయ నగర్‌కు చెందిన కూన సత్యనారాయణ ఇటీవల మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఫిర్యాదు చేశాడనే కోపంతో రవీంద్ర ఆదివారం సత్యనారాయణ ఇంటివద్దకు వచ్చి హంగామా చేశాడు. ఇంటి బయట ఉన్న చప్టా పగలకొట్టి, మొక్కలకు వేసిన ఫెన్సింగ్‌ను తొలగించాడు. సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ హెడ్ కానిస్టేబుల్ రామయ్య తెలిపారు.

ర్యాలీలు, ధర్నాలకు అనుమతులు లేవు : డీఎస్పీ

గుడివాడ : గుడివాడ సబ్ డివిజన్ పరిధిలో 30 పోలీస్ యాక్టు అమలులో ఉన్న నేపథ్యంలో ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలకు ఎటువంటి అనుమతులు లేవని గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైన సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు నిర్వహించాలంటే పోలీసుల అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు. అనుమతులు తీసుకోకుండా ఎవరైన సమావేశాలు, సభలు నిర్వహిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జనసేనలో పలువురి చేరిక

గుడివాడ, జూలై 20(ఆంధ్రజ్యోతి) : జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేస్తున్న అభివృద్ధి, పార్టీ కార్యకర్తలకు ఇస్తున్న భరోసాను చూసి పెద్ద ఎత్తున పార్టీలో చేరుతున్నట్టు జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ తెలిపారు. ఆదివారం స్థానిక జనసేన నియోజకవర్గ కార్యాలయంలో బూరగడ్డ సమక్షంలో లోయ రాజా ఆధ్వర్యంలో ముత్యాల అశోక్, వడ్డాది సుబ్రహ్మణ్యం, షేక్ హుసేన్, బొజ్జగాని కోటేశ్వరరావులతో పాటు 50మంది జనసేనలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి సాయన రాజేష్, నాయకులు సుంకర వెంకట్, షేక్ మీరా షరీఫ్, దుర్గరావు, వై.శ్రీనివాసరావు, నరసయ్య, సాయికృష్ణ, పరుచూరి రాజేష్, మర్రాపు పూర్ణ, కళ్యాణి, భవాని, శిరీష, పద్మ, నాగరాణి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.



జనసేనలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్

రాంబాబుకు యూనియన్ నేతల పరామర్శ

గుడివాడ, జూలై 20(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆటోనగర్‌లోని జయలక్ష్మీ ఇంజినీరింగ్ వర్క్స్‌లో విద్యుదాఘాతానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెల్డర్ రాంబాబును ఆదివారం ది గుడివాడ ఇండస్ట్రియల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పరామర్శించారు. యూనియన్ నాయకులు అంజనేయులు, కల్వకుంట నాగరాజు, రెడ్డి నాగరాజు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

మద్యం కుంభకోణం దోషులకు శిక్ష పడాల్సిందే ..

తోట్లవల్లూరు : మద్యం కుంభకోణంలో వైసీపీ ఎంపీ మిధున్‌రెడ్డికి కోర్టు రిమాండ్ విధించటం సరైందేనని, పేదల రక్తం తాగిన దోషులకు శిక్ష పడాల్సిందేనని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అధికారం అప్పగిస్తే మద్యం వ్యాపారాన్ని ప్రభుత్వమే తీసుకుని సొంత వారి కంపెనీల నుంచి నాణ్యతలేని మద్యాన్ని సరఫరా చేసి 30వేల మంది చావుకు కారణమైన వైసీపీ నేతలందరిని జైలుకు పంపాల్సిన అవసరం ఉందన్నారు.

వృద్ధులకు భోజన వసతి

గుడివాడ : చిన్నారుల పుట్టినరోజు వేడుకలను వృద్ధులు,పెద్దల సమక్షంలో జరుపుకోవడం అభినందనీయమని ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు లోయ ఈశ్వర వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక మమత వృద్ధాశ్రమంలో క్లబ్ లైఫ్ పెట్రోన్ సభ్యులు తుమ్మలపల్లి వరప్రసాద్ మనుమరాలు అభయ చిన్నయి 4వ జన్మదినం సందర్భంగా కేక్‌ను కట్ చేసి వృద్ధులకు భోజన వసతి కల్పించారు.

గుడివాడలో ఏటీఎస్‌ను ఏర్పాటు చేయాలి

● ఆర్‌సీపీ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి

గుడివాడ, జూలై 20(ఆంధ్రజ్యోతి) : ఆటోమెటిక్ టెస్టింగ్ సెంటర్(ఏటీఎస్)ను గుడివాడలో ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సుందరయ్యభవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుడివాడ ఆర్టీవో పరిధిలో 33 రకాల 67వేల వాహనాలు ఉన్నాయని, జిల్లా మొత్తంలో అధిక వాహనాలు ఇక్కడే ఉండటంతో ఆటోమెటిక్ టెస్టింగ్ సెంటర్‌ను గుడివాడలో ఏర్పాటు చేయడం సమంజసమన్నారు. మచిలీపట్నంలో ఏర్పాటు చేయడంతో వాహన యజమానులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లాకు నడిబొడ్డులో గుడివాడ ఉందని, ఏటీఎస్ సెంటర్ ఏర్పాటుకు స్థానిక ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే వెనిగండ్ల రాములు జోక్యం చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి గుడివాడ పరిసర ప్రాంతంలోనే ఏటీఎస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఆర్‌సీపీ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు సీహెచ్ శివనాగమల్లేశ్వరరావు, రేపాని కొండ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	228
చికెన్ స్కిన్‌లెస్	238

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 520





శివరామకృష్ణ క్షేత్రానికి రూ.లక్ష విరాళం

కోడూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కోడూరులో పునర్నిర్మాణం చేస్తున్న శివరామకృష్ణ క్షేత్రానికి అవనిగడ్డకు చెందిన బండ్రెడ్డి లంకేశ్వరరావు కుటుంబ సభ్యులు రూ.1,01,116 విరాళంగా అందజేశారు. లంకేశ్వరరావు డిపో వద్దకు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు వెళ్లి విరాళాన్ని అందుకున్నారు. లంకేశ్వరరావు కుటుంబసభ్యులను సత్కరించి అభినందనలు తెలిపారు. బడే భావన్నారాయణ, అన్నం సుబ్బారావు, యద్దనపూడి గోపాలకృష్ణ, తూనుగుంట్ల మహేష్, అన్నం శివరామకృష్ణ పాల్గొన్నారు.



మాజేరు వంతెన వద్ద గుర్రపుడెక్క తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్, పనులు పర్యవేక్షిస్తున్న డీసీ చైర్మన్, కూటమి నేతలు



దేవరకోట వంతెన వద్ద గుర్రపుడెక్క తొలగింపు పనులు

ప్రమాదకరంగా మాజేరు వంతెన

• ఎమ్మెల్యే మండలి దృష్టికి సమస్య • తక్షణం గుర్రపుడెక్క తొలగింపు పనులు • కొత్త వంతెన నిర్మించాలని వినతి

చల్లపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మాజేరులో లింగన్నకోడు వంతెన ప్రమాదకరంగా మారింది. గుండేరులో పెద్దఎత్తున గుర్రపుడెక్క పేరుకుపోయి వంతెనకు పట్టి ఉన్న కారణంగా మురుగునీరు పారుదల లేక వంతెన పటిష్టతపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సమస్యను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆదేశాలతో ఆదివారం గుర్రపుడెక్క తొలగింపు పనులు చేపట్టారు. చల్లపల్లి డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్‌కుమార్, కోసూరు డీసీ వైస్‌చైర్మన్ పరిశె చలపతిరావు, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, నేతలు మోర్ల శివ, బొర్రా అగ్గిరాముడు, బండి నాగార్జున తదితరులు పనులను పర్యవేక్షించారు. ఆదివారం ఉదయం నుంచి గుర్రపుడెక్క తొలగింపు పనులు జరుగుతూనే ఉన్నాయి. మరో రోజు పనులు కొనసాగే పరిస్థితి ఉంది. మొదటి కానాలోంచి నీటి ప్రవాహం జరుగుతుండగా ఉధృతికి వంతెన అప్రోచ్ రోడ్డు మలుపు కోతకు గురైంది. వంతెన పటిష్టతను దృష్టిలో ఉంచుకుని వంతెన వద్ద గుర్రపుడెక్క లేకుండా పూర్తిస్థాయిలో తొలగించాల్సిన అవసరం ఉంది.

వంతెనను పటిష్ఠం చేయాలి

వంతెనను పటిష్టపరిచి కోతకు గురైన అప్రోచ్‌ను బలోపేతం చేయాలని ప్రజలు కోరుతున్నారు. శిథిలావస్థకు చేరిన మాజేరు వంతెన స్థానంలో నూతన వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి వంతెన నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. చల్లపల్లి మండలం కొత్తమాజేరు, మచిలీపట్నం రూరల్ మండలం గ్రామాలైన చిన్నాపురం, పెదయాదర, చినయాదర, భోగిరెడ్డిపల్లి తదితర గ్రామాలకు ప్రజలు ఈ వంతెన మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన వంతెన పటిష్టంగా, సౌకర్యవంతంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గుండేరులో గుర్రపు డెక్కను తొలగించండి

ఘంటసాల : గుండేరులో దట్టంగా అల్లుకుపోయిన గుర్రపు డెక్క, తూడు కాడ తొలగించాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేస్తున్నారు. దేవరకోట సమీపంలోని గుండేరు వంతెనపై రైతుల కొద్దిసేపు నిరసన తెలియజేశారు. గుండేరులో దట్టంగా అల్లుకుపోయిన గుర్రపు డెక్క వల్ల నీటి ప్రవాహం సరిగా ఉండడం లేదన్నారు. బిరుదుగడ్డ వంతెన, దేవరకోట వంతెన, ఘంటసాలపాలెం వంతెన వద్ద గుర్రపు డెక్క నిలిచిపోవటంతో నీరు ఎగదన్ని ఆయకట్టులోని ఆకుమడులు నీటమునిగాయనిరైతులు పేర్కొన్నారు. తక్షణమే అధికారులు స్పందించి గుర్రపు డెక్కను తొలగించాలని రైతులు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదేశాలతో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న గుర్రపు డెక్క తొలగింపు చర్యలకు శ్రీకారం చుట్టారు. నిరసన తెలిపిన వారిలో అందె జగదీష్, జాస్తి రామచంద్ర బాబు, కొప్పుల వెంకటేశ్వరరావు, అజయ్ కుమార్, సన్న, చిన్న కారు రైతులు పాల్గొన్నారు.



రామవరపుమోడిలో పర్యటించి కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

రామవరపుమోడిలో సుపరిపాలనలో తొలి అడుగు

బంటుమిల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ, అభివృద్ధి పథకాలతో పాటు రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు కూటమి ప్రభుత్వ విజయానికి నిదర్శనం అని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. రామవరపుమోడీ గ్రామంలో ఆదివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు కూనపరెడ్డి వీరబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఇంటింటా తిరిగి సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏఎంసీ చైర్మన్ ఒడుగు తులసీరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గంధం సత్యనారాయణ, కాశీ, కట్టా జయస్వామి, రత్నకుమార్, రంగనాయక గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

కవి సూర్యనారాయణకు సత్కారం



సూర్యనారాయణను సత్కరిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

నాగాయలంక, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలోని అంబేడ్కర్ స్మృతివనం ఆవరణంలో సామాజిక న్యాయ మహాశిల్పం పాదాల చెంత ఆదివారం జరిగిన ప్రణామం కార్యక్రమంలో కవి సూర్యనారాయణను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సత్కరించారు. రెండు రాష్ట్రాల కవులతో జరిగిన కవి సమ్మేళనంలో వందలాది మంది కవులు పాల్గొన్నారు. దివిసీమ నుంచి కవులు జి.సూర్యనారాయణ, నడకుదిటి రాధాకృష్ణమూర్తి హాజరుకాగా, జి.సూర్యనారాయణను కలెక్టర్ సత్కరించి జ్ఞాపిక అందజేశారు. నవమల్లెతీగ సంస్థ అధ్యక్షులు కలిమిశ్రీ పాల్గొన్నారు.



శ్రీహరి సంస్మరణ సభలో మాట్లాడుతున్న జన సాహితీ అధ్యక్షుడు డి.వి.కుమార్

శ్రమజీవుల మదిలో శ్రీహరికి సుస్థిర స్థానం

కోడూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : తాను నమ్మిన సిద్ధాంతం కోసం తుది శ్వాస వరకు అలుపెరగని పోరాటం చేసిన సైకం శ్రీహరి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా ఉంటారని జన సాహితీ రాష్ట్ర అధ్యక్షులు డి.వి.కుమార్, రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పలపాటి వీరబాబు, మత్స్యకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు పేర్కొన్నారు. సాలెంపాలెం గ్రామంలో రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో సైకం శ్రీహరి సంస్మరణ సభ నిర్వహించారు. రైతు కూలీలు, శ్రమ జీవుల సమస్యల పరిష్కారానికి శ్రీహరి అలుపెరగని పోరాటం చేశారన్నారు. రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు జగన్, తలశిల లీలా మనోహర్, సీనియర్ కమ్యూనిస్టు నాయకులు రాజశేఖర్, పర్చూరి రాఘవేంద్రరావు, రైతు కూలీ సంఘం మండల నాయకులు కన్నా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వెంట్రపాటి దమయంతికి సీపీఎం నేతల నివాళి



దమయంతి భౌతికకాయంపై అరుణ పతాకాన్ని కప్పి నివాళులర్పిస్తున్న నాయకులు

బంటుమిల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : పెందుర్రు గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నేత కీ.శే.వెంట్రపాటి గంగా నాగేశ్వరరావు సతీమణి, సీపీఎం మండల కమిటీ సభ్యుడు శ్యామ్ మాతృమూర్తి వెంట్రపాటి దమయంతి (82) ఆదివారం మృతి చెందారు. ఆమె భౌతికకాయాన్ని సీపీఎం జిల్లా కమిటీ నేత ఆర్‌సిపి రెడ్డి, పరుచూరి ధన శ్రీ, గౌరిశెట్టి నాగేశ్వరరావు, మాజేటి శివశ్రీనివాసరావు, అజయ్‌ఘోష్, బొడ్డు నాగరాజు, పొదిలి వెంకన్న, వంగల రాజు, వి.రాంబాబు, కొల్లూరి శ్యామలరావు, వై సుబ్బారావు, కొమ్మాలపాటి రవి ఆమె పార్థివ దేహంపై ఎర్ర జెండా కప్పి ఘన నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యుడు ఉమామహేశ్వరరావు తదితరులు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.




పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో మాట్లాడుతున్న ఆంధ్రాబ్యాంక్ విశ్రాంత ఏజీఎం టి.వి కృష్ణప్రసాద్

ఏజే కళాశాల పూర్వవిద్యార్థుల అపూర్వ సమ్మేళనం

మచిలీపట్నం టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రజాతీయ కళాశాలలో 1970లో చదివిన పూర్వవిద్యార్థుల సమ్మేళనం బందరులోని జికన్వెన్షన్ హాలులో ఆదివారం సందడిగా జరిగింది. ఐదు దశాబ్దాల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు కుశల ప్రశ్నలు వేసుకుని విద్యనభ్యసించిన నాటి అనుభవాలను పంచుకున్నారు. వైద్యులు, సైంటిస్టులు, లెక్చరర్లు, ఉపాధ్యాయులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు పూర్వ విద్యార్థులో ఉన్నారు. పూర్వ విద్యార్థి, ఆంధ్రా బ్యాంకు విశ్రాంత ఏజీఎం టివి కృష్ణప్రసాద్, రామకృష్ణ సేవా సమితి నిర్వాహకులు సింగరాజు గోవర్దన్, పైడిపాటి కృష్ణాజీ, డాక్టర్ నారగం అమరేంద్ర, తాతినేని సుబ్బారావు, సింహాచలం, చుండూరి రాజేంద్ర, జక్కా శ్రీనివాస్, ఎ.వాసుదేవ్, ఆర్‌డి ప్రసాద్ తదితరులు మధురజ్ఞాపకాలను పంచుకున్నారు. మచిలీపట్నం పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

సైకిల్ తొక్కితే మంచి ఆరోగ్యం



సైకిల్ ర్యాలీ ప్రారంభించి అవగాహన కల్పిస్తున్న శ్రీరాం

మచిలీపట్నం టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : సైకిలు తొక్కడం వల్ల మంచి ఆరోగ్యం సొంతమవుతుందని స్టార్ విద్యాసంస్థల అధినేత పి.శ్రీరాం అన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్టార్ స్కూలు విద్యార్థులతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీరామ్‌ను మచిలీపట్నం శాఖ కార్యదర్శి హసీం బేగ్, ఉపాధ్యక్షుడు అయ్యప్పస్వామి, ఆదిత్య, నూర్జహాన్‌బేగం, రాజేంద్రప్రసాద్, అశోక్ బాబు, చింతయ్య, వి సత్యనారాయణ అభినందించారు.





సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కావడి సేవ

మచిలీపట్నం టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : సుబ్రహ్మణ్యస్వామి ఆడి కృత్తిక మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. పూలకావడి, వివాహ కావడి, సంతాన కావడి, ఆరోగ్య కావడి, విద్యా కావడి, పండ్ల కావడి, పాల కావడి, పసుపు కావడి, కుంకుమ కావడి, బెల్లం కావడి, బియ్యం కావడి, పూల కావడి, పానకం కావడి వంటి వెయ్యి కావడిలతో కేరళ సంప్రదాయ వాయిద్యాలతో ఆదివారం భక్తులు ఆడికృత్తిక మహోత్సవంలో పాల్గొన్నారు. కోనేరుసెంటర్ కన్యకాపరమేశ్వరి ఆలయం నుంచి బయలు దేరిన కావడి సేవ జిల్లాపరిషత్ సెంటర్ మీదుగా మేకావానిపాలెం వల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానానికి చేరుకుంది. భక్తులు తీసుకొచ్చిన పాలు, చెరకు రసాలు, పంచదార, తేనె, పెరుగు, పళ్ల రసాలు, పన్నీరు, పసుపు, కుంకుమ, విభూదిలతో అభిషేకాలు నిర్వహించి హారతులు ఇచ్చారు. శరణవభవ అంటూ భక్తుల స్మరణ ప్రతిధ్వనించింది. కేరళ సంప్రదాయ వాయిద్యాలు, సన్నాయి మేళాలతో మచిలీపట్నం పురవీధుల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు స్వామి వారికి మొక్కుబడులు సమర్పించారు.

వాసవీక్లబ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు

చల్లపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి శుక్లాల వైద్యశిబిరం, ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ మోహనరావు 70 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 20 మందికి శుక్లాల ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. హోమియో వైద్యశిబిరంలో డాక్టర్ మణికంఠ 70 మందిని పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు మాజేటి అమరవాణి, గోళ్ల వెంకటరత్నం, కోశాధికారి జూపూడి కిరణ్, దింటకుర్తి జ్యోతి, ఉరిమి సువర్చల, ఉరిమి రమేష్, తమ్మన సతీష్, మలిశెట్టి చెంచురాములు, నంబూరు కుసుమ, కూరపాటి గుప్తాలను పర్యవేక్షించి సేవలు అందించారు.

మెరైన్ పోలీసుల ఉచిత వైద్యశిబిరం

మచిలీపట్నం టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : గిలకలదిండి తుపానుషెల్టర్‌లో ఆదివారం మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గిలకలదిండి, గరాలదిబ్బ, బందరుకోట ప్రజలకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. గిలకలదిండి మెరైన్ ఇన్‌స్పెక్టర్ కె.వంశీకృష్ణ, ఎస్సైలు విజె చంద్రబోస్, పరింకాయల మురళీ, వాటపల్లి రమేష్ తదితరులు శిబిరాన్ని పర్యవేక్షించారు.

పౌరాణిక నాటకానికి పూర్వవైభవం





విడియాల చక్రవర్తిని పురస్కారంతో సత్కరిస్తున్న బుల్లయ్య, చాణక్యుడిగా ఇవటూరి ప్రసాదబాబు

మచిలీపట్నం టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : తెలుగు పౌరాణిక నాటకానికి పూర్వవైభవం తీసుకుని వచ్చేందుకు సాంస్కృతిక సంస్థలు కృషి చేయాలని మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ళ బుల్లయ్య అన్నారు. రామకృష్ణా నాట్యమండలి స్వర్ణోత్సవం ఆదివారం రాత్రి మహతి వేదికపై ఘనంగా నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు జొన్నలగడ్డ జగన్మోహనరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో డాక్టర్ బి ధన్వంతరి ఆచార్య, గొర్రెపాటి గోపీచంద్, మచిలీపట్నం రంగ స్థల కళాకారుల సంక్షేమసంఘం అధ్యక్షుడు వేముల సూరిబాబు, ప్రముఖ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, భవి ష్య, పెద్దిరాజు, పివి.ఫణికుమార్, జొన్నలగడ్డ శ్రవణ్‌కుమార్ మాట్లాడారు. కళాకారులకు వృద్ధాప్య పింఛన్ల సమస్యను మంత్రి రవీంద్ర దృష్టికి తీసుకెళ్లామని మోటమర్రి బాబా ప్రసాద్ అన్నారు. రామకృష్ణా నాట్యమండలి స్వర్ణోత్సవ పురస్కారాలను సాహితీవేత్త విడియాల చక్రవర్తికి, కెబ్రహ్మచారికి, విష్ణుభొట్ల సూర్యనారాయణ శర్మ, వై.రాధిక సుబ్రహ్మణ్యం, పుప్పాల వీరాంజనేయులుకు అందజేశారు. కళాసేవా పురస్కారాలను 12 మంది కళాకారులకు అందజేశారు. మంగళగిరి కళాకారుడు ఇవటూరి ప్రసాద బాబు ప్రదర్శించిన చాణక్యుడు ఏకపాత్ర అందరినీ ఆకట్టుకుంది. బాలనాగమ్మ నాటకంలోని మాయల పకీరు, సంగు సీనును గాజుల కృష్ణమూర్తి నాయుడు, మార్కాపురం గజలక్ష్మి రక్తికట్టించారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు ఆషాఢ సారె

అవనిగడ్డ, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : దివి ప్రజల ఇలవేల్పు లంకమ్మ అమ్మవారికి ఆదివారం ఆషాఢసారె సమర్పించారు. అవనిగడ్డ మూడు, తొమ్మిది వార్డుల మహిళలు మేళతాళాలతో గ్రామోత్సవంగా తరలివచ్చి అమ్మవారికి సారె సమర్పించారు. ఆరో వార్డులోని చింతలపూడి వంశస్థుల ఆడపడుచులు చీర, సారెలతో అమ్మవారికి మొక్కుబడులను సమర్పించుకున్నారు. ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. **చల్లపల్లి** : లక్ష్మీపురం దుర్గాపార్వతీ సమేత సోమేశ్వర స్వామి ఆలయంలో అమ్మవార్లకు మహిళలు ఆషాఢ సారె సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు భమిడిపాటి బాలసుబ్రహ్మణ్యం, ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావులకు అమ్మవారి సారెను అందించి ప్రత్యేక పూజలు చేశారు. ఈవో దంపతులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు చల్లపల్లిలో గ్రామదేవత సంపటాలమ్మ అమ్మవారికి భక్తులు సారె సమర్పించగా, ఆలయ పూజారి చల్లపల్లి కోటేశ్వరరావు దంపతులు పూజలు చేశారు. **ఘంటసాల** : కొడాలిలో వీరంకి వారి ఇలవేల్పు అంకమ్మ తల్లికి ఆదివారం ఆషాఢ సారె సమర్పించారు. వీరంకి వంశస్థులు, ఆడపడుచులు పసుపు, కుంకుమ, స్వీట్లు, పండ్లు, చీరలు తీసుకుని ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సారెను సమర్పించారు. **నాగాయలంక** : భావదేవరపల్లిలో గ్రామ దేవత అలంకాల దేవరకు భక్తులు ఆషాఢ సారె సమర్పించారు. ముమ్మారెడ్డి బాబురావు ఇంటి వద్ద నుంచి మహిళలు ఆషాఢ సారెను మేళతాళాలతో తీసుకొచ్చి సమర్పించారు. అర్చకులు శాస్త్రి ప్రత్యేక పూజలు చేశారు. ముమ్మారెడ్డి సత్తిబాబు పర్యవేక్షించారు. ఆలయ అర్చకులు శాస్త్రి ప్రత్యేక పూజ లు చేశారు. ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు. **అవనిగడ్డ రూరల్** : పులిగడ్డలో మహిళలు ఊరేగింపుగా తరలివచ్చి పోలాశమ్మ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ఆషాఢ సారె సమర్పించారు. పులిగడ్డ కనకదుర్గమ్మ, అలివేలు మంగ, రాజ్యలక్ష్మీదేవికి, అంకాలమ్మ అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు.

శాకంబరిగా గంగానమ్మ, రెడ్డంకమ్మ

కోడూరు : కోడూరు గంగానమ్మ అమ్మవారు శాకంబరిగా ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసినట్లు ఆలయ ధర్మకర్త కోట యుగంధర్‌రావు తెలిపారు. అర్చకులు కొమ్మూరు శ్రీనివాస శర్మ ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. **అవనిగడ్డ** : అవనిగడ్డలో పద్మశాలీయుల కులదైవం రెడ్డంకమ్మ శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు బట్టు నరసింహారావు వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. మహిళలు లలితా సహస్రనామ పారాయణం గావించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 600 మందికి అన్న సమారాధన జరిగింది.

సూర్యనారాయణస్వామికి శాంతి కల్యాణం

అవనిగడ్డ రూరల్ : వేకనూరులో ఉషా పద్మిని సమేత సూర్యనారాయణ స్వామి శాంతి కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. కాశీభట్ల రాజశేఖర శర్మ బ్రహ్మత్వంలో సనకా శ్రీనివాసరావు - ఉదయ లక్ష్మి దంపతులు పీటల మీద ఆశీనులై కల్యాణం నిర్వహించారు. మార్తి వెంకటేశ్వరరావు ఆర్థిక సాయంతో అన్నదానం నిర్వహించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త తుంగల వీర వసంతరావు - ఇందిరా దంపతులు పర్యవేక్షించారు.



అవనిగడ్డ లంకమ్మ అమ్మవారికి..



లక్ష్మీపురం దుర్గమ్మకు..



కొడాలి అంకమ్మ తల్లికి..

చెరువులో వృద్ధురాలి మృతదేహం

కోడూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : కోడూరు శివారు కృష్ణాపురంలో కన్పించకుండా పోయిన వృద్ధురా లు చెరువులో శవమై తేలింది. వృద్ధురాలు చందన రాంప్రసాదం (90) శుక్రవారం రాత్రి నుంచి కనిపించటం లేదని మనుమడు మనోజ్ శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం కృష్ణాపురంలోని ఆమె ఇంటి సమీపంలో చెరువులో వృద్ధురాలి మృతదేహం గుర్తించినట్లు ఇన్‌చార్జ్ ఎస్సై రాజేష్ తెలిపారు. మృతదేహన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిర్వహిం చి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఏవో పరీక్షకు 127 మంది హాజరు

పెడన రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఎల్‌ఐసీలో ఏవో ఉద్యోగాలకు ప్రిలిమినరీ పరీక్ష ఆది వారం నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగినట్లు ప్రిన్సిపాల్ బీఆర్‌ఎస్ రెడ్డి తెలిపారు. పరీక్షకు 180 మందికి గాను 127 మంది మాత్రమే హాజరయ్యార న్నారు.

అష్టావధానం నేడు

మచిలీపట్నం టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : బచ్చుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం సాయంత్రం శతావధాని ఆముదాల మురళి అష్టావధానం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు ముక్తేవి శశికాంత్ తెలిపారు. సిరి కవి డాక్టర్ చింతలపాటి మురళీకృష్ణ సంచాలకులుగా వ్యవహరించే అష్టావధాన కార్యక్రమంలో డాక్టర్ పీటీజీవీ రం గాచార్యులు నిషిద్ధాక్షరి చేపట్టనున్నారు. సమస్యను కె కనకదుర్గ మహలక్ష్మి, దత్తపదిని మద్దూరి రామ్మోహనరావు, వర్ణన ఓలేటి ఉమాసరస్వతి, న్యస్తాక్షరి కారుమూరి రాజేంద్రప్రసాద్, ఆసువు గుడిపూడి రాధికారాణి, అప్రస్తుత ప్రసంగం దండిబొట్ల దత్తాత్రేయ శర్మ చేపట్టనున్నారు.

దుస్తుల పంపిణీ

మచిలీపట్నం టౌన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రైలుపేట, దొంతులమ్మ దేవాలయం పరిసరాల్లోని పేదలకు ఆదివారం దుస్తులను పంపిణీ చేశారు. స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు నీలపాల ఫణికుమార్, మణిబాబు, నరేష్, గౌరీశంకర్, అయినాల సుధాకర్, స్వామి, నవీన్, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలు నిలుపుదల నేడు

చల్లపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తున్న కారణంగా చల్లపల్లి పోస్టాఫీసులో 21వ తేదీ సోమవారం వినియోగదారుల సేవలు నిలుపుదల చేసినట్లు హెడ్ పోస్ట్‌మాస్టర్ వి.నాంచారయ్య తెలిపారు. మంగళవారం నుంచి యథావిధిగా కొనసాగుతాయన్నారు.